Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 07.03.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 40 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# సమరానికి సిగ్నల్



***దేశ భవిష్యత్‌ను నిర్ణయించే 16వ సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపింది. సాధారణంగా ఏప్రిల్, మేనెలల్లో ప్రతిగ్రామంలోనూ తిరునాళ్లు, జాతరలు జరుగుతుంటాయి. ఇప్పుడు వాటితో పాటూ దేశ వ్యాప్తంగా ఎన్నికల జాతర కూడా జరగబోతుంది.***

- దేశవ్యాప్తంగా 9విడతల్లో ఎన్నికలు
- తెలంగాణలో ఏప్రిల్ 30, సీమాంధ్రలో మే7న పోలింగ్
- మే 16న తేలనున్న దేశ రాజకీయ భవిష్యత్తు

గతంలో ఎన్నడూ లేనివిధంగా 9విడతలలో ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమీషన్ నిర్ణయం తీసుకుంది. తొలిదశ ఏప్రిల్ 7వ తేదీన 2రాష్ట్రాలలో 6 లోక్‌సభ స్థానాలకు, రెండోవిడతలో ఏప్రిల్ 9న 5రాష్ట్రాలలో 7లోక్‌సభ స్థానాలకు, 3వ విడత ఏప్రిల్ 10న 14రాష్ట్రాలలో 92లోక్‌సభ స్థానాలకు, 4వ విడత ఏప్రిల్ 12న 3రాష్ట్రాలలో 5లోక్‌సభ స్థానాలకు, 5వ విడత ఏప్రిల్ 17న 13రాష్ట్రాలలో 122లోక్‌సభ స్థానాలకు, 6వ విడత ఏప్రిల్ 24న 12రాష్ట్రాలలో 117లోక్‌సభ స్థానాలకు, 7వ విడత ఏప్రిల్ 30న 9 రాష్ట్రాలలో 89లోక్‌సభ స్థానాలకు, 8వ విడత మే7న 7 రాష్ట్రాలలో 64లోక్‌సభ స్థానాలకు, 9వ విడత మే12న 3 రాష్ట్రాలలో 41లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. మే 16వతేదీన ఫలితాలు వెల్లడవుతాయి. లోక్‌సభ **(మిగతా 10వ పేజీలో)**





## తర్జనభర్జనలో వున్న క్యాడర్‌లో ధైర్యం పెంచిన "బాబు గర్జన"

**దాదాపు పదేళ్ల తర్వాత నెల్లూరులో తెలుగుదేశంపార్టీ ఉనికి కనిపించింది. పార్టీ కేడర్‌లో ఉత్సాహం తొణికిసలాడింది. నగరమంతా పసుపు పచ్చదనం పరుచుకుంది. లీడర్, కేడర్ ఏకమై తెలుగుదేశంకు ప్రాణం పోసింది.**

ఈ నెల 5వ తేదీన నెల్లూరులో నిర్వహించిన చంద్రబాబు ప్రజాగర్జన అనూహ్యంగా విజయవంతమైంది. విఆర్‌సి మైదానంలో నిర్వహించిన ప్రజాగర్జన సదస్సుకు తెలుగుదేశంశ్రేణులు భారీగా కదలివచ్చాయి. ముఖ్యంగా కాంగ్రెస్ నుండి ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు తెలుగుదేశంలో చేరడంతో పార్టీకి ఊపు వచ్చింది. వీరి నేతృత్వంలో కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. రేణిగుంట నుండి నెల్లూరుకు చేరుకున్న చంద్రబాబుకు స్థానిక నాయకులు **(మిగతా 10వ పేజీలో)**



*రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన రావడంతో అధికార యంత్రాంగం రాజ్యమేలుతుంది. ముఖ్యంగా గవర్నర్ నరసింహన్ తన తడాఖా చూపిస్తున్నాడు. ఇప్పుడు రాష్ట్రానికి ప్రతినిధి ఆయనే! పరిపాలనంతా కూడా ఆయన చేతుల మీదుగానే జరుగుతుంది.*

## "నరసింహా"వతారం

రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన రావడంతో అధికార యంత్రాంగం రాజ్యమేలుతుంది. ముఖ్యంగా గవర్నర్ నరసింహన్ తన తడాఖా చూపిస్తున్నాడు. ఇప్పుడు రాష్ట్రానికి ప్రతినిధి ఆయనే! పరిపాలనంతా కూడా ఆయన చేతుల మీదుగానే జరుగుతుంది. పాలనాపగ్గాలు చేపట్టగానే అక్రమాలపై దృష్టిపెట్టాడు. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల యజమానులు బంద్‌కు దిగితే కన్నెర్రజేసి వారిని దారికి తెచ్చాడు. అదే గవర్నర్ కాకుండా ప్రభుత్వం అయ్యుంటే పెట్రోల్ బంకుల యజమానులతో బేరసారాలు సాగించేది. వాళ్లను బుజ్జగించడానికి మంత్రుల కమిటీనొకదానినేసేది. నాలుగైదు రోజులు చర్చలు సాగించి ప్రభుత్వం బ్రతిమిలాడితే వాళ్లు సమ్మె

**(మిగతా 10వ పేజీలో)**



## డి.ఆర్.కి ముళ్ళకిరీటం

*జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి అంటే కాంగ్రెస్‌లో ఓ మంత్రిస్థాయి పదవి. ఎన్నికల సమయంలో ఈ పదవిలో ఉండడం చాలా కీలకం. ఈ పదవి కోసం చాలామంది నాయకులు తీవ్రంగానే ప్రయత్నిస్తుంటారు. అయితే అలాంటి ప్రయత్నాలేవీ చేయకుండానే కొడవలూరు ధనుంజయరెడ్డిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షపదవి వరించింది. తనకు ఈ పదవి వస్తుందని ఆయన ఊహించనేలేదు.* **(మిగతా 10వ పేజీలో)**



## • 12న ముహూర్తం
# కిరణ్ కొత్తపార్టీ

రాష్ట్ర విభజన విషయంలో కేంద్రప్రభుత్వ వైఖరినే నిరసించి ముఖ్యమంత్రి పదవితో పాటు తన శాసనసభ్యత్వానికి, కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సొంత పార్టీ దిశగా అడుగులు వేసారు. ఈ నెల 12వ తేదీన రాజమండ్రి వేదికగా కొత్తపార్టీ ఆవిష్కరణకు ముహూర్తం నిర్ణయించారు. పార్టీ పేరు, పార్టీ జెండా, అజెండా అన్నీ రాజమండ్రిలో జరిగే పార్టీ ఆవిర్భావసభలోనే ప్రకటిస్తామని కిరణ్ 6వ తేదీ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. కిరణ్ పార్టీలో కాంగ్రెస్ బహిష్కృత ఆరుగురు ఎంపీలతో పాటూ మరికొందరు ఎమ్మెల్యేలు ఇతర నాయకులు కూడా చేరే అవకాశాలున్నాయి.

పార్టీలో ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, హర్షకుమార్, సాయిప్రతాప్‌లు కీలకపాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి సీమాంధ్రలో అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను నిలబెట్టే దిశగా కిరణ్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. 12 తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం!



# పురపోరుకు తెరలేచింది

**సార్వత్రిక ఎన్నికలలోపు మున్సిపల్ ఎన్నికలు ఉండవని భావిస్తూ వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేసుకుంటూ వచ్చింది. ఇంకో వారంలో దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ రాబోతుంది. ఈ సమయంలో మున్సిపల్ ఎన్నికలు ఉండవులే అని అందరూ అనుకున్నారు. ఈ సమయంలో ఎన్నికలు నిర్వహించలేమని అధికారులు కూడా చేతులెత్తేసారు. సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. ఎన్నికలు నిర్వహించాల్సిందేనని తేల్చిచెప్పింది. ఎన్నికల సంఘం ఈ దిశగా ఏర్పాటు చేసింది. మార్చి 30న రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలక, పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించ డానికి రంగం సిద్ధమైంది. ఈమేరకు మేయర్, ఛైర్మెన్, డివిజన్‌ల వారీగా రిజర్వేషన్‌లను ఖరారు చేసారు.**

జిల్లాలో నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, సూళ్లూరుపేట మున్సిపాల్టీలకు, నాయుడుపేట నగర పంచాయితీకి ఎన్నికలు జరుగనున్నాయి. నెల్లూరు మేయర్‌ను బి.సి జనరల్‌కు, ఆత్మకూరు మున్సిపల్ ఛైర్మెన్ పదవిని ఎస్టీ మహిళకు, వెంకటగిరి మున్సిపల్ ఛైర్మెన్ పదవిని బి.సి మహిళకు, సూళ్లూరుపేట, నాయుడుపేట ఛైర్మెన్ పదవులను ఎస్సీ మహిళకు కేటాయించారు. కావలి జనరల్ మహిళకు కేటాయించగా, గూడూరు మాత్రమే జనరల్‌లో వుంది. ఆత్మకూరు, సూళ్లూరుపేట మున్సిపాల్టీలకు తొలిసారిగా ఎన్నికలు జరుగుతున్నాయి. అలాగే నగర పంచాయితీగా నాయుడుపేటకు కూడా ఇవే తొలిఎన్నికలవుతాయి.

ముఖ్యంగా రాష్ట్రంలో ప్రభుత్వం లేకుండా, ప్రజాప్రతినిధుల పెత్తనం లేకుండా మొత్తం అధికార యంత్రాంగం పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరుగుతుండడం విశేషం. ఎన్నికలకు నెలరోజులు కూడా లేకపోవడంతో అధికార యంత్రాంగం తీవ్రంగానే కసరత్తు చేస్తుంది.

జిల్లాలో గూడూరు తప్పితే మిగిలిన అన్ని మున్సిపాల్టీలకు రిజర్వేషన్లు రావడంతో అన్ని పార్టీలు కూడా ఆయా వర్గాలకు చెందిన అభ్యర్థులపై కసరత్తు చేస్తున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ సార్వత్రిక ఎన్నికల మూడ్‌లో వున్నాయి. ఆ ఎన్నికల దృష్టితోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

అయితే తలవని తలంపుగా ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నెత్తిన పడ్డాయి. ఒకరకంగా సార్వత్రిక ఎన్నికలకు ముందు వీటిని సెమీఫైనల్స్ అనుకోవచ్చు. నెలరోజుల తేడాలోనే రెండు ఎన్నికలు జరగబోతున్నాయి. మున్సిపాల్టీలలో వచ్చే ఫలితాలు దాదాపు సార్వత్రిక ఎన్నికలలో పునరావృతమయ్యే అవకాశాలున్నాయి. ఎందుకంటే ఈ ఎన్నికలు కూడా పార్టీ గుర్తుల మీదే జరగబోతున్నాయి కాబట్టి. ఇంతవరకు రాష్ట్రంలో పంచాయితీ, సహకార ఎన్నికలు మాత్రమే జరిగాయి. ఆ ఎన్నికలలో పార్టీ గుర్తులు లేవు కాబట్టి ఏ పార్టీ బలమేంటో అంచనా వేయడం కష్టం. కాని రేపు మున్సిపల్ ఫలితాలను బట్టి అసెంబ్లీ, లోక్‌సభ ఫలితాలను అంచనాలేయొచ్చు.

రాష్ట్ర విభజనకు ముందన్నా ఈ ఎన్నికలు వచ్చివుంటే కాంగ్రెస్ నాయకుల పని కొంతలోకొంత బాగుండేది. రాష్ట్ర విభజన జరగక ముందు, ప్రభుత్వం ఉన్నప్పుడు పంచాయితీలు, సహకార ఎన్నికలు జరిగాయి కాబట్టి కొంతలో కొంత ఆ పార్టీ పరువు నిలిచింది. కాని ఇప్పుడు రాష్ట్ర విభజనతో సీమాంధ్ర ప్రజలు కాంగ్రెస్‌పార్టీ పేరు వింటేనే మండిపోతున్నారు. హస్తం గుర్తును చూస్తే బ్యాలెట్‌నే చించేంత కసితో ఉన్నారు. దీనికితోడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదు. రాష్ట్రపతి పాలన వచ్చింది. కాంగ్రెస్ నాయకుల పప్పులుడికే పరిస్థితి లేదు. సీమాంధ్రలో కాంగ్రెస్ పతనానికి ఈ ఎన్నికలే తొలిమెట్టు అనుకోవాలి. సీమాంధ్ర అంతటా జగన్ గాలి ఉందనేది ప్రచారం. మరి ఆ గాలి ఏ స్థాయిలో ఉందనేది కూడా ఈ ఎన్నికలలోనే బయటపడుతుంది. అధికారం కోసం అర్రులు చాస్తున్న తెలుగుదేశంకు రేపు సార్వత్రిక ఎన్నికలలో ఎంత సీన్ ఉందనేది ఈ ఎన్నికల ద్వారా నెలముందే తెలియబోతుంది.



## నెల్లూరు కార్పొరేషన్ డివిజన్ల రిజర్వేషన్‌లు

| కేటగిరి | డివిజన్‌లు |
|---|---|
| ఎస్టీ జనరల్ | 5, 53 |
| ఎస్టీ మహిళ | 38 |
| ఎస్సీ జనరల్ | 9, 13, 35, 51 |
| ఎస్సీ మహిళ | 17, 18, 32 |
| బి.సి జనరల్ | 2, 7, 16, 21, 27, 37, 41, 44, 52 |
| బి.సి మహిళ | 54, 11, 47, 30, 28, 46, 36, 10, 23 |
| జనరల్ మహిళ | 31, 26, 48, 24, 50, 25, 45, 3, 33, 39, 49, 22, 19, 15 |
| జనరల్ | 20, 12, 1, 42, 6, 34, 29, 8, 14, 40, 43, 4 |

## గూడూరు బరిలో.. రాజీవ్



ఉన్నట్లుండి మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. అందరూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మీదే దృష్టి పెట్టి ఉన్నారు. అయితే అనూహ్యంగా మున్సిపల్ ఎన్నికలు రావడంతో అన్ని పార్టీలు అభ్యర్థుల అన్వేషణలో పడ్డాయి. జిల్లాలో ఒక కార్పొరేషన్ ఆరు మున్సిపాల్టీలు ఉంటే వీటిలో జనరల్ అయ్యింది ఒక్క గూడూరు మున్సిపాల్టీ మాత్రమే. దీంతో గూడూరు మున్సిపల్ ఛైర్మెన్ సీటు కోసం అగ్రవర్ణాల నాయకుల మధ్య తీవ్రపోటీ నెలకొంది. గూడూరు అసెంబ్లీ గత కొన్ని దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వుడ్‌గా ఉండడంతో అగ్రవర్ణాల నాయకులకు మున్సిపాల్టీయే దిక్కు. ఇది కూడా అప్పుడప్పుడు రిజర్వ్‌డ్‌లోకే పోతుంటుంది. ఇప్పుడు మాత్రం జనరల్ అయ్యింది.

తెలుగుదేశం, కాంగ్రెస్‌ల నుండి ఇంతవరకు ఎవరూ ఛైర్మెన్ అభ్యర్థులుగా బయటకు రాలేదు. కాని వైయస్సార్సీ ఛైర్మెన్ అభ్యర్థిగా మాత్రం ఎల్లసిరి రాజీవ్‌రెడ్డి పేరు వినిపిస్తుంది. వైకాపా సిఇసి సభ్యుడిగా వున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి కొడుకే రాజీవ్‌రెడ్డి. యువకుడు, విద్యావంతుడు. ఇటీవలకాలంలో పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నాడు. నియోజకవర్గం పార్టీలోని ఇతర నాయకులు కూడా రాజీవ్‌రెడ్డి అభ్యర్థిత్వానికి అభ్యంతరం చెప్పే అవకాశాలు లేవు.

## రూలర్‌కే రూరల్!



*ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తెలుగుదేశంపార్టీకి ఫెవికాల్‌తో అతికించినట్లుగా ఉండిపోయిన రాజకీయ చాణక్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.*

సోమిరెడ్డికి నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం సీటును ఖరారు చేసినట్లు తెలుస్తుంది. దీంతో ఇప్పుడు సర్వేపల్లికి అభ్యర్థిని వెదకాల్సి వస్తుంది. జిల్లాలో రాజకీయ పరిస్థితులు చాలా మారాయి. జిల్లాలోని 10అసెంబ్లీ నియోజకవర్గాలకు వైకాపా అభ్యర్థులను ప్రకటించడంతో, అక్కడ అభ్యర్థులను బట్టి మిగతా పార్టీలు తమ అభ్యర్థులను మార్చుకుంటున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గానికి వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఖాయం కావడంతో తెలుగుదేశం, కాంగ్రెస్‌ల నుండి నాయకులు ఆ సీటుపై ఆసక్తి చూపడం లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశంలో చేరినా ఆయన నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇక సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి 1994 నుండి కూడా సర్వేపల్లి నియోజకవర్గం నుండే పోటీ చేస్తూ వచ్చారు. రెండుసార్లు గెలిచాడు. రెండుసార్లు ఓడిపోయాడు. 2009 ఎన్నికల్లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో పొదలకూరు, మనుబోలు మండలాలు సర్వేపల్లిలో కలిసాయి. సోమిరెడ్డికి ఇది కొంచెం ఇబ్బందిగా మారింది. ఈ రెండు మండలాలలో కాకాణికి గట్టి పట్టుంది. 2009ఎన్నికలలో ఆదాల గెలుపుకు ఈ రెండు మండలాలలో మెజార్టీయే ప్రధాన కారణమైంది. ఈసారి సర్వేపల్లి నుండి స్వయంగా కాకాణే రంగంలోకి దిగుతుండడంతో ఆయన మీద పోటీచేసి గెలవాలనుకోవడం సాహసమే! ఇప్పటికే మూడుసార్లు ఎదురుదెబ్బలు తిన్న సోమిరెడ్డికి అంత సాహసం చేసే ఓపిక కూడా లేదు. అందుకే కొంతలోకొంత బెటరయిన రూరల్ నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు.

## దూకడానికి సాకు దొరికింది



*కాంగ్రెస్ మునిగే పడవ. ఈ పార్టీలో ఉండడం ఇక దండగని చాలామంది నాయకులు భావిస్తున్నారు. ఈ కోవలోకి చెందిన వాడే రాచాల రవికుమార్.*

చాలామంది నాయకులు స్థానికంగా ఆనం సోదరులతో ఉన్న మొహమాటం వల్ల కాంగ్రెస్‌ను వదిలి ఇతర పార్టీలలోకి వెళ్లలేకపోతున్నారు. అయితే ఇప్పుడు అలాంటి వారికి ఓ సాకు దొరికింది. ఆ సాకును పెట్టుకుని పార్టీని వదిలిపోవడానికి అవకాశం వచ్చింది.

ఎన్నో ఏళ్లుగా నానబెట్టి ఎట్టకేలకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి కొడవలూరు ధనుంజయరెడ్డిని నియమించారు. వాస్తవంగా ఈ పదవి కోసం ఆయన ప్రయత్నించింది కూడా లేదు. ఆయన పేరును ఎందుకు ప్రకటించారనేది సిఫార్సు చేసినవాళ్లకే తెలియాలి.

ఈ టైంలో కాంగ్రెస్ టైం బాగా లేదు. డీసీసీ అధ్యక్షపదవిని తీసుకున్నా ఉపయోగం లేదు. రాష్ట్రంలో అధికారం వున్నా, లేదా రేపు ఎన్నికల్లో మళ్లీ అధికారం వస్తుందనే ఆశ వున్నా డీసీసీ అధ్యక్షపదవికి విలువ ఉంటుంది. ఇప్పుడెలాగూ అధికారం లేదు. రేపు ఎన్నికలలో సీమాంధ్రలో కాంగ్రెస్‌కు సీపీఎంకు పెద్ద తేడా ఉండదు. అలాంటప్పుడు డీసీసీ అధ్యక్ష పదవిని తీసుకుని మాత్రం ఏం వెలగబెడతారు. పని చేటు, మనీ చేటు తప్ప.

కాని దీని మీద కూడా కొందరు కాంగ్రెస్ నాయకులు అలిగారు. డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వలేదని రాచాల రవికుమార్‌యాదవ్ అనే నాయకుడు కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసారు. ఇంకా కొందరు అదే వరుసలో ఉన్నారు. అదేదో సామెతలాగా కాంగ్రెస్‌ను వదలడానికి డీసీసీ అధ్యక్ష నియామకం వీరికి అవకాశంగా మారింది.

## వలసలతో బలపడేనా?



**సీపీఎం, సీపీఐ వంటి పార్టీలకు శాశ్వతంగా ప్రతిపక్షంలో ఉండడం అలవాటైపోయింది. అధికారం వచ్చినా అందులో ఇమడాలంటే ఆ పార్టీలకు కష్టం. ప్రతిపక్షంలో వుండి అధికారపక్షంపై రాళ్లు విసరడమే వారికి హాయిగా వుంటుంది.**

మిగతా పార్టీలు అలాకాదు. ప్రతిపక్షంలో ఉండాలంటే వాటికి నరకమే. అధికారం కోసం చొంగకార్చుకుంటూ ఎదురు చూస్తుంటాయి. ఈ బాపతులోదే తెలుగుదేశంపార్టీ. రాష్ట్రంలో పదేళ్లుగా అధికారానికి దూరంగా వుంది. ఇన్నేళ్లు అధికారానికి దూరమై కూడా ఆ పార్టీ ఇంకా బ్రతికి బట్ట కడుతుందంటే అది చంద్రబాబు నాయకత్వ సమర్థతే అనుకోవాలి. వీరాభిమానంతో కొందరు పారిశ్రామికవేత్తలు పదేళ్లుగా ఆ పార్టీని కాపాడుకుంటూ వస్తున్నారు.

ఇప్పటికే పదేళ్లు అధికారానికి దూరమయ్యారు. అధికారం కోసం ఆ పార్టీ నాయకులు ఆవురావురుమంటున్నారు. మరోసారి ఆ పార్టీ అధికారానికి దూరమైతే మాత్రం పార్టీలో కేడర్, లీడర్ నిలిచే పరిస్థితి లేదు. అదీగాక రాష్ట్ర రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. రాష్ట్రం నుండి తెలంగాణ వేరు పడింది. తెలంగాణలో తెలుగుదేశంకు సీన్ లేకుండా పోయింది. అక్కడ టీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలదే హవా. చంద్రబాబు ఆశలన్నీ సీమాంధ్రపైనే! వాస్తవంగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని పెట్టకుండా ఆయన కాంగ్రెస్‌లోనే ఉండుంటే తెలుగుదేశం పరిస్థితి మెరుగ్గా ఉండేది. కాంగ్రెస్ మీదున్న వ్యతిరేకత తెలుగుదేశంకు కలిసొచ్చేది. అసలు ఈ పరిస్థితిలో అయితే అధికారం కూడా అందేది. జగన్ పార్టీ పెట్టడం చంద్రబాబుకు శాపంగా మారింది.

తెలుగుదేశంపార్టీకి ఇప్పుడు వలసలే పెద్ద దిక్కయ్యాయి. కాంగ్రెస్‌పార్టీ నుండి వచ్చేవారి కోసం చంద్రబాబు పార్టీ తలుపులను బార్లా తీసాడు. గంటా శ్రీనివాసరావు, టి.జి.వెంకటేష్, ఏరాసు ప్రతాప్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఇంకా ఎందరో కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలోకి దూరుతున్నారు. అయితే ఈ వలసలతో నిజంగా తెలుగుదేశం బలపడుతుందా? అన్నది కూడా పెద్ద ప్రశ్న. కాంగ్రెస్ నుండి కేడర్ అంతా వైకాపాలోకి వలస పోయింది. లీడర్లు మాత్రమే తెలుగుదేశంలోకి వస్తున్నారు. కాంగ్రెస్ నుండి వస్తున్న కొద్దిమంది నాయకులు మాత్రం వ్యక్తిగతంగా వారికున్న పరపతి దృష్ట్యా స్థానికంగా ప్రభావం చూపే అవకాశముంది. దీనివల్ల కొన్ని నియోజకవర్గాలలో తెలుగుదేశం బలం పెరిగి ఆ పార్టీ గెలిచే సీట్లను ఇంకొంచెం పెంచుకునే అవకాశముంది. అంతేగాని ఈ వలసలతో తెలుగుదేశానికి మెజార్టీ సీట్లు రావడం గగనమే.



# ‘టౌన్‌హాల్ హౌస్‌ఫుల్’

**ఇది విడ్డూరంగా వుంది కదూ..! అవును మీరు చదివింది నిజమే. నెల్లూరులో కళాసంస్థలు సాహిత్య సంస్థలూ మనుగడ సాగించడం కోసం నగర నడిరోడ్డులో రేబాల కుటుంబం నిర్మించిన టౌన్‌హాల్ ప్రస్తుతం యేడాది పొడవునా అన్ని ఆదివారాలూ బుక్ అయిపోతోంది.**

## ఆదివారాల కోసం పోటీపడుతున్న సంస్థలు

నెల్లూరులో కళాసంస్థలకి కొదవలేదు. కళాకారులకీ లోటులేదు. అన్నింటినీ మించి కళాపోషకులకీ కరువేలేదు. ముఖ్యంగా ఇటీవల కాలంలో కళారంగం రెండుగా విడిపోయి ఒకరితో ఒకరు పోటీపడుతూ ప్రతి ఆదివారం ఏదో ఒక కార్యక్రమాన్ని నెల్లూరీయులకు అందిస్తున్నారు. ఇక అడపాదడపా జరిగే సాహిత్య కార్యక్రమాలకు హాలు దొరకక పాపం సాహిత్య సంస్థలు పనిదినాల్లో సాహిత్య సమావేశాలు జరుపుకోవడంతో సాహితీ సభలకు జనం కరువైపోతున్నారు.

అసలే సాహిత్య కార్యక్రమాలంటే జనం పల్చన కావడం తెలిసిందే. అదీ ఆదివారం హాలు దొరకక మిగిలిన రోజుల్లో కార్యక్రమం పెట్టుకోవడంతో, ఆ వచ్చే కొద్దిమందీ రావడం లేదని సాహిత్య సంస్థలు లబోదిబోమంటున్నాయి.

పబ్లిసిటీ జిలతో ఓ హోటల్ యజమాని కొంతమంది కళాకారులను తన వెంట త్రిప్పుకుంటూ వారితో అన్ని కళాసంఘాలు ఇన్ని కళాసంఘాలూ అంటూ కళాకారుల్లో విభజన తెచ్చి తన పని కానిచ్చేసుకుంటున్నాడు. పనిలో పనిగా తన హోటల్‌లోని ఓ చిన్న గదిలో సైతం అప్పుడప్పుడు సంస్మరణలూ, సంతాపసభలూ లేదా అభినందనలూ అంటూ తనతో పాటు ఓ పది కళాసంస్థల నిర్వాహకులను ప్రక్కన బెట్టుకుని ఫోటోలు తీయించుకుని తన హోటల్ పేరునే ఇంటి పేరుగా మార్చుకుని పత్రికల ద్వారా పబ్లిసిటీ చేయించుకుంటున్నాడు.

తన గదిలోనే ప్రెస్‌మీట్ పెట్టి చేయబోయే కార్యక్రమ వివరాలను రిపోర్టర్లకు చెప్తాడు. కార్యక్రమంలో అధ్యక్షత వహించేది ఈయనే, ముఖ్యఅతిథీ ఈయనే, కార్యక్రమ నిర్వాహకుడూ ఈయనే అన్నింటినీమించి కార్యక్రమ వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించేదీ ఈయనే. ఆయన తీరును గమనిస్తేనే ఆయనకెంత పబ్లిసిటీ పిచ్చి వుందో మనకి అర్థమౌతుంది.

అసలు కార్యక్రమాన్ని నిర్వహించే సంస్థ నిర్వాహకులు ఈ వ్యక్తి చేసే చేష్టలను చూసి ఆయన ఎదురుగా నోరు విప్పే ధైర్యం లేక మూగనోము పాటిస్తున్నారు.

సభలోని ముఖ్యఅతిథో లేక అధ్యక్షుడో లేక ప్రత్యేకఆహ్వానితుడో తానే ప్రెస్‌మీట్ పెట్టి కార్యక్రమ వివరాలను అందించడం ఎక్కడి సంప్రదాయమో అర్థం కాదు.

కొంత మంది విలేకరులు సైతం ఈ హోటల్ యజమానికి భజన చేస్తూ ఓ చేతిలో రెండొందల కవరు, మరో చేతిలో బిరియాని పొట్లం పడగానే ఈ హోటల్ యజమాని వార్తకు ప్రాధాన్యత కల్పించి జిల్లా పేజీలో ప్రధానంగా ప్రచురించేస్తున్నారు. తమ స్వార్థంకోసం పత్రికలనే తాకట్టు పెట్టేస్తున్నారు.

తన తెలివంతా ఉపయోగించి రోజూ తన పేరు పేపర్లో వచ్చేలా చేసుకుంటున్న ఈ మహాకళాపోషకుడు ఆదివారాలు ఖాళీలేకుండా టౌన్‌హాలు బుక్ చేసేస్తున్నాడు.. ఎవరన్నా ఏదైనా కార్యక్రమం తనకు తెలియకుండా టౌన్‌హాల్లో ప్లాన్ చేయబోతున్నారని తెలిస్తే అప్పుడికప్పుడు ఏదో ఒక సంస్థను సృష్టించి అదే కార్యక్రమానికి పేరు మార్చి వారికంటే ఒక రోజు ముందే అలాంటి కార్యక్రమాన్ని తాను నిర్వహించేస్తున్నాడు.

కళాకారుల మధ్య కళాసంస్థల మధ్య ఏర్పడిన అనారోగ్య పోటీతత్వం కారణంగా మంచి కార్యక్రమాలే నెల్లూరీయులకు కరువైపోయాయి.

ఒకప్పుడు నెఫ్జా, సిఫ్కా, కళాప్రియ వంటి సంస్థలు కార్యక్రమాలు నిర్వహిస్తే పాసుల కోసం జనం పోటీపడేవారు. ప్రస్తుతం నెల్లూరు కళారంగానికి ఆ పరిస్థితే లేకుండా పోయింది. కళాంజలి సంస్థ “అనంత్” అప్పుడప్పుడు చేస్తున్న కొన్ని కార్యక్రమాలతో పాటు ఇటీవల కొత్తగా ఏర్పడిన వైష్ణవి ఫిలింఫ్యాక్టరీలాంటి కొన్ని సంస్థలు మాత్రమే ఎక్కడా రాజీ పడకుండా తమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

కళాకారులూ, కళాసంస్థలూ, ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకుంటే మంచిది. ఎవరితోనో పోటీపడి, ఎవరికోసమో ఆరాటపడి కేవలం పబ్లిసిటీ పరమావధిగా బ్రతికే వారి కోసం చెత్త కార్యక్రమాలను ఏర్పాటు చేసి నెల్లూరుజిల్లాలో కళారంగానికున్న మంచిపేరును మంటగలపొద్దు. చేసే కార్యక్రమాల సంఖ్య తక్కువైనా, వున్నవాటి స్థాయి ఎక్కువగా వుండేలా చూసుకుంటే కళాభిమానులు సంతోషిస్తారు.

ఇక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేవారు సైతం కేవలం పత్రికలలో ఫోటో కోసమో, పేరు కోసమో, లేక తాము చేసే కార్యక్రమాల సంఖ్యను పెంచుకోవడం కోసమో కాకుండా చేసే కార్యక్రమం సాహితీప్రియులకు చేరవయ్యే స్థాయిలో దేశ వ్యాప్తంగా వున్న ప్రముఖ సాహితీవేత్తలను నెల్లూరుకు రప్పించి చేస్తే తిక్కన వంటి మహనీయులు, ఆత్రేయ వంటి మనసుకవులు జన్మించిన నెల్లూరుగడ్డ పునీతమౌతుంది. ఇది విమర్శ కాదు సూచన మాత్రమే. కార్యక్రమంలో పస వుంటే చేసేవారిలో సత్తా వుంటే ఆ కార్యక్రమానికి ఆదివారమే అవసరం లేదు. టౌన్‌హాలుతో అసలు పనే లేదు. ఒక్కసారి ఆలోచించుకోండి, కళలకు కాణాచి సింహపురి అన్న నానుడికి మచ్చరానీయకండి.



# శివయ్య నామస్మరణతో విశాఖతీరాన్ని హోరెత్తించిన సుబ్బరామయ్య



- మీ అభిమానం కావాలి
- నా ఆఖరిశ్వాస వరకు మీకు సేవ చేస్తా...

- టి.సుబ్బరామిరెడ్డి

*మహాశివరాత్రి నాడు విశాఖ సముద్రతీరం... జన సముద్రం అయింది! సముద్ర హోరు ఆగి శివనామఘోషతో మోగిపోయింది. ఎటుచూసినా... స్త్రీలు-పిల్లలు... పెద్దలు-శివరాత్రి సందడి అంతా అక్కడే వుంది- సముద్ర తీరంలో వున్న కాళీమాత ఆలయం ఎదురుగా... భారీఎత్తున లక్షనూట ఎనిమిది శివ లింగాలతో నిండిన శివలింగం వెలిసింది. అదే ప్రతి శివరాత్రికి ... సముద్ర తీరంలో విశాఖ ప్రజలను అలరించే టిఎస్సార్ సృష్టి!*



**గత** 40 ఏళ్ళుగా విశాఖ ప్రజల సంక్షేమానికి జీవితం అంకితం చేసిన యం.పి. సుబ్బరామిరెడ్డి గత 30 ఏళ్ళుగా...ప్రతి శివరాత్రి నాడు విశాఖ సముద్రతీరంలో శివలింగం ప్రతిష్ఠించి... మహాభిషేకం చేస్తున్నారు. తానొక్కడే శివుడిని అభిషేకం చెయ్యడమే కాక...జాతి కుల భేదాలు లేకుండా ప్రజలంతా స్వయంగా శివాభిషేకం చేసే విధంగా సౌకర్యాలు కలుగజేసి శివరాత్రి పుణ్యాన్ని ప్రజలకు పంచుతున్నారు. ఈ శివరాత్రి వైభవానికి ప్రముఖ రాజకీయనాయకులతో పాటు దర్శకరత్న దాసరి నారాయణరావు, డి.రామానాయుడు, మోహన్‌బాబు, బ్రహ్మానందం లాంటి సినీ ప్రముఖులు కూడా వచ్చారు.

ఈ మహాకుంభాభిషేకం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం చేస్తున్నాను. నా ఆఖరి శ్వాస వరకు విశాఖ ప్రజలకు సేవ చేస్తాను! మీ అభిమానంతో నేను మూడోసారి యం.పిని అయ్యాను! ఈ అభిమానం ఎల్లప్పుడూ కోరుకుంటాను అని ఉద్వేగంతో ప్రసంగించారు రాజ్యసభసభ్యులు సుబ్బరామిరెడ్డి!

ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు, నిర్మాత, నటుడు మాజీమంత్రి దాసరి నారాయణరావు మాట్లాడుతూ 15ఏళ్ళ తర్వాత విశాఖలో అడుగుపెట్టానని. చాలా ఆనందంగా వుందని అన్నారు. సుబ్బరామిరెడ్డిగారు శివరాత్రి పూజకు రమ్మనగానే వెంటనే ఆనందంగా అంగీకరించి వచ్చేశాను. సినిమా రంగంలో సినిమా ప్రేక్షకులలో ప్రాంతీయ విభేదాలు వుండవు. సినిమా బాగుంటే బ్రహ్మరథం పడతారు. బాగోపోతే తిప్పికొడతారు. ఇకముందు అటు హైదరాబాద్... ఇటు విశాఖ పట్టణం రెండూ సినిమారంగాన్ని ప్రోత్సహించాలి! అలాగే అజాత శత్రువు అనే పదానికి తగిన మనిషి టి.సుబ్బరామిరెడ్డి. మనం మనకి ఏం చేసుకున్నాం... అనే దానికంటే... ప్రజలకు ఎంత సేవ చేశాం అని ఆలోచించుకోవాలి! ఇవాళ టిఎస్సార్ రాజ్యసభసభ్యుడు అయినారంటే... ఆయన కోరుకుంటే ఇవ్వలేదు! కేంద్రం పిలిచి ఇచ్చిన పదవి అని టియస్సార్‌ను ప్రశంసించారు!

## స్వామిజీలు ప్రజలకు ధర్మమార్గం చూపించాలి...

***- శ్రీ ఆదిశంకర స్వరూపానందేంద్రస్వామి***

విశాఖ శ్రీ శారద పీఠాధిపతి...ఆదిశంకర వారసులు అయిన స్వరూపానందేంద్ర స్వామికి ఆధ్యాత్మిక ధార్మిక ప్రవక్త అనే బిరుదు ప్రదానం చేసి, బంగారు పతాకంతో సత్కరించారు సుబ్బరామిరెడ్డి. అందుకు స్వామి తన కృతజ్ఞతలు చెబుతూ నేను మత ప్రవక్తనుకాను! సర్వసంగ పరిత్యాగిని! ఈ బిరుదులు, సత్కారాలు నేను అందుకోరాదు! సుబ్బరామిరెడ్డి గారు తన అభిమానంతో ఇచ్చిన ఈ బిరుదును సగౌరవంగా సింహాచలం అప్పన్నకు సమర్పిస్తున్నాను. ఎవరి తల్లి వారికి గొప్ప! ఎవరి మతం వారికి గొప్ప! అంతే తప్ప ఒకరొ్నకరు దూషించుకోవడం నేరం, పాపం! అన్ని మతాల్లో ధర్మం ఒక్కటే! అబద్ధం చెప్పు... ఎదుటి వాడిని కొట్టు... దేవాలయాలను పడగొట్టు అని ఏ మతమూ చెప్పదు! అంటరానితనం అనేది మనిషిలో వుండదు... మనసులో వుండే జబ్బు! నేను ధర్మ బోధచేస్తూ... దళితవాడల్లో పర్యటించాను. అంత మాత్రాన నేను అపవిత్రుడ్ని అయిపోయానా? కొందరు దేవుడిని.. దేవుడి పూజలను వ్యాపార వస్తువుగా అమ్ముకుంటున్నారు. అది పాపం, నేరం అని అమాయక భక్తులకు బోధించడమే నాధర్మం! అందుకే విశాఖలో సుబ్బరామిరెడ్డి పేదల కోసం నిర్మించిన ధర్మసత్యపు కార్యక్రమాన్ని అభినందించాను అన్నారు స్వామీజీ.

హీరో మోహన్‌బాబు మాట్లాడుతూ నేటి సమాజం కుల రాజకీయాలకు వేదిక అయింది. ఓట్లు దండుకోవడం... పదవులు సంపాదించడమే ఈనాటి రాజకీయ నాయకుల ధర్మం! అలాంటి సమాజంలో సుబ్బరామిరెడ్డి మానవసేవే మాధవసేవగా భావించడం అభినందనీయం అన్నారు.

నటుడు బ్రహ్మానందం సుబ్బరామిరెడ్డిని ధర్మరాజు అని ప్రశంసించారు. ఈ సభలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తర్వాత సాలూరి వాసూరావు సంగీత విభావరి, మంజుభార్గవి, దీపికారెడ్డి శివతాండవం ప్రజలను అలరించాయి.

మూడుదశాబ్దాలుగా సుబ్బరామిరెడ్డి చేస్తున్న ఈ మహాభిషేకం భారతదేశ చరిత్రలోనే ఓ ప్రత్యేక కార్యక్రమంగా నిలిచిపోతుందని ఈ కార్యక్రమంలో అశేషంగా పాల్గొన్న శివభక్తులు అనడం సర్వత్రా వినిపించింది.

ప్రతియేటా సుబ్బరామయ్య ఆ శివయ్యకి చేస్తున్న ఈ పుణ్య కార్యక్రమంతో ఆయన జన్మ ధన్యమై, ఆ ఆదిశంకరుడు టి.యస్.ఆర్.కి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలూ ప్రసాదించాలని ఆకాంక్షిద్దాం.








## భవిష్యత్ మనదే!

రాష్ట్రం విడిపోయిందని, అభివృద్ధి చెందిన హైదరాబాద్‌ను కోల్పోయామని మనం బాధపడాల్సిన పని లేదు. ఇంకో పదేళ్ల తర్వాతయినా ఈ పరిస్థితి తప్పదు. రాష్ట్రం కలిసి ఉన్నంతకాలం రాష్ట్రంలో హైదరాబాద్‌ను తప్ప ఇంకే నగరాన్ని అభివృద్ధి చేయరు. అదేదో ఇప్పడే విడిపోతే మన సీమాంధ్రలోని నగరాలను అభివృద్ధి చేసుకోవచ్చు.

కె.రామలింగారెడ్డి, ఆళ్లగడ్డ.

## జగన్ హీరో.. కిరణ్ జీరో

ఓదార్పుయాత్రను మొండిగా అడ్డుకొన్న సోనియాను ఎదిరించి కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి పార్టీ స్థాపించి ఆంధ్రావనిలో జగనే అన్నీ అయ్యారు. ఉపఎన్నికలలో ఢంకా భజాయించాడు. 16నెలలు జైల్లో ఉన్నా బెయిల్ కొరకు ఎక్కడా రాజీ పడలేదు. సమైక్యాంధ్ర కొరకు ఎంపీ పదవికి రాజీనామా చేసారు. నిరాహారదీక్షలు చేసారు. జాతీయ పార్టీల నాయకుల వద్ద సమైక్య వాణిని బలంగా వినిపించాడు. అందుకే జగన్ హీరో.

కిరణ్‌కుమార్‌రెడ్డి సీల్డ్‌కవర్ ముఖ్యమంత్రి. ఎన్నికలదాకా ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు డబుల్ యాక్షన్ చేశాడు. సంక్షేమపథకాలను నీరుగార్చారు. ఆయన నిజంగా హీరో అయితే సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేసేవాడు. ఆయన ప్రజాస్వామ్యవాది కాదు, దగాస్వామ్యవాది. అందుకే ప్రజలను మరచి యావజ్జీవ ప్రతిపక్షనేతగా ఎదుగుతున్న చంద్రబాబుతో కుమ్మక్కయి, ఎన్నికల తర్వాత ప్రతిపక్ష నేతగా డీప్రామోషన్ అవుతారు.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## పోయేకాలం

కాంగ్రెస్‌పార్టీకి పోయే కాలం దాపురించింది. ఆంధ్రప్రదేశ్ విభజన విషయంలో ఆ పార్టీ అనుసరించిన పోకడలను చూస్తుంటేనే ఇది అర్థమవుతుంది. కీలకమైన విషయాల మీద స్పందించే సత్తాలేని రాహుల్ గాంధీని ఈ దేశం ప్రధానిగా కోరుకోవడం లేదు. కాంగ్రెస్ నాయకులు చౌకబారు విమర్శలుచేస్తూ ఆ పార్టీని మరింతగా నాశనం చేస్తున్నారు.

వల్లెపు మోహన్, బిట్రగుంట.

## 'ప్రభా'తం

మనం పత్రికలలో అప్పుడప్పుడూ చూస్తుంటాం... అప్పులపాలైన కుటుంబం సామూహిక ఆత్మహత్య చేసుకుందని, తల్లిదండ్రులు విషం తాగి తమ పిల్లల చేత కూడా తాగించారని... ఇలాంటి సామూహిక ఆత్యహత్యలు కుటుంబాలలోనే కాదు రాజకీయపార్టీలలోనూ ఉంటాయని కాంగ్రెస్‌పార్టీ నిరూపించింది. రాజకీయాలలో హత్యలుండవు, ఆత్మహత్యలు తప్ప... అని చాలామంది రాజకీయనాయకులు చెబుతుంటారు. ఏపి విభజన విషయంలో రాజకీయ ఆత్మహత్య ఏ విధంగా ఉంటుందో కాంగ్రెస్ చేసి చూపించింది. పొదుగును చూసి ముంతను ఒలకబోసుకున్నట్లుగా వస్తాయోరావో తెలియని సీట్ల కోసం ఆ పార్టీ సొంత బలాన్ని, సొంత జనాన్ని చంపుకుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన ద్వారా ఒక రాష్ట్రం రెండు రాష్ట్రాలయ్యాయి. మన సంస్కృతిలో ఏదైనా జాతరకుగాని, కొత్త భవనాలను ప్రారంభించేటప్పుడు గాని జంతువులను బలిచ్చే మూఢాచారం ఒకటి ఉంది. తెలంగాణ అనే కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి కూడా కాంగ్రెస్ పార్టీ అదే సంప్రదాయాన్ని అనుసరించింది. తెలంగాణ కోసం సీమాంధ్రప్రాంతంలో కాంగ్రెస్‌పార్టీని, దానిని నమ్ముకుని వున్న నాయకులను బలిపెట్టింది. ఇక్కడున్న కాంగ్రెస్ నాయకులకు వారంతటవారే రాజకీయంగా ఆత్మహత్యలు చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

### కాంగ్రెస్ ఆత్మహత్య



టీ-ప్రక్రియ మొదలైంది మొదలు కాంగ్రెస్ నేతల మాటలు, చేష్టలన్నీ కూడా అరాచకంగానేవున్నాయి. రెండునెలల పాటు సీమాంధ్రలో ఆందోళనలు జరిగినా ఏ మాత్రం పట్టించుకోలేదు. మీ చావు మీరు చావండన్నట్లుగా వదిలేసారు. సీమాంధ్రలో ఆందోళనలను శాంతింపజేసేలా కాంగ్రెస్ నేతలు వ్యవహరించలేదు.

భారతదేశంలో కాంగ్రెస్‌పార్టీని స్వాతంత్ర్యానంతరం నుండి నేటివరకు ఆదరిస్తున్న పెద్ద రాష్ట్రం ఏదన్నా వుందంటే అది ఆంధ్రప్రదేశే! 1978 ప్రాంతంలో దేశమంతటా కాంగ్రెస్‌పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. అలాంటి కాలంలో కూడా కాంగ్రెస్‌పార్టీని ఆదరించిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. గత కొన్ని దశాబ్దాలుగా చూస్తే పెద్ద రాష్ట్రాలలో కాంగ్రెస్ ఒక్కొక్కటిగా పతనమవుతూ వస్తుంది. ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, మధ్యప్రదేశ్... ఇవన్నీ ఒకప్పుడు కాంగ్రెస్ ఏలుబడిలోని రాష్ట్రాలే. కాని ఇప్పుడు చూస్తే మధ్యప్రదేశ్‌లో తప్పితే మిగిలిన రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా లేదు. ఇన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు గడ్డు పరిస్థితి వచ్చినా ఆంధ్రప్రదేశ్ మాత్రం కాపాడింది. 1998, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరపరాజయం పొందడంతో దేశంలో ఇక కాంగ్రెస్ పతనమైందనే అనుకున్నారు. కాని 2004, 2009 ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీని నిలబెట్టింది ఆంధ్రప్రదేశే! అలాంటి రాష్ట్రానికి, అలాంటి అభిమానం చూపిన జనానికి ఈరోజు కాంగ్రెస్ ఏమిచ్చింది? అవమానకరమైనరీతిలో ఈ రాష్ట్రాన్ని విభజించి ఈ రాష్ట్ర ప్రజలను లెక్కలేనితనంగా చూసింది. సీమాంధ్ర పట్ల కనీస గౌరవం ప్రదర్శించలేదు. రాష్ట్రాన్ని విభజిస్తున్నాం, మీ సమస్యలేంటి, మీ వెతలేంటి, మీకేం కావాలనేది తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. సీమాంధ్రలో పాతిక లోక్‌సభ స్థానాలున్నాయి. వీటిలో నాలుగు సీట్లు తెలుగుదేశానివి. మిగతావి కాంగ్రెస్‌వే! ఈ సీట్లుండబట్టే కాంగ్రెస్ కేంద్రంలో మనగలిగింది. ఇన్ని సీట్లున్న సీమాంధ్రకు కనీస న్యాయం చేయాలన్న ఇంగితం కూడా కాంగ్రెస్ అధిష్టానానికి లేకుండాపోయింది.

సీమాంధ్రలో ఈరోజు కాంగ్రెస్‌పార్టీ చచ్చిపోయింది. కాంగ్రెస్‌పార్టీ తరపున పోటీ చేయాలంటేనే నాయకులు భయపడే పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ పేరు చెప్పుకోవడానికి కూడా నాయకులు జంకుతున్నారు. సోనియా, రాహుల్‌ల ఫోటోలు పెట్టుకుంటే జనం తరిమికొట్టేటట్లున్నారు. కాంగ్రెస్ నాయకుల పరిస్థితయితే అగమ్యగోచరంగా వుంది. ఇప్పటికే కొంతమంది నాయకులు వైయస్సార్ కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. మరి కొంతమంది తెలుగుదేశంలోకి పోతున్నారు. ఈ రెండు పార్టీల్లో సీట్లు గ్యారంటీ లేనివాళ్లు ఎక్కడికి పోవాలో తెలియని అయోమయస్థితిలో వున్నారు. కాంగ్రెస్‌లో ఉంటే ఇక భవిష్యత్ లేదు. కాంగ్రెస్ తరపున పోటీ చేస్తే డిపాజిట్లు కూడా రావు. కాంగ్రెస్ పార్టీకి సీమాంధ్రలో ఇక పదిహేను, ఇరవైఏళ్ల భవిష్యత్ లేదని ఇటీవల కేంద్రమంత్రి జైరాంరమేష్ వ్యాఖ్యానించడం తెలిసిందే! సీమాంధ్రలో కాంగ్రెస్, బీజేపీ ఒకే స్థాయిలో ఉండబోతున్నాయి. ఒకరకంగా సీమాంధ్రను వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి అప్పగించి కాంగ్రెస్ పార్టీ సామూహిక ఆత్మహత్యకు పాల్పడిందని చెప్పొచ్చు.

ఇక ఏ ప్రయోజనాన్నైతే ఆశించి కాంగ్రెస్‌పార్టీ విభజనకు పాల్పడిందో, ఆ ప్రయోజనం నెరవేరకుండా పోయే సూచనలు కనిపిస్తున్నాయి. టీఆర్ఎస్ విలీనం అవుతుందనే గుడ్డినమ్మకంతో కాంగ్రెస్ విభజనకు తెగబడింది. అయితే తెలంగాణ ఏర్పాటు కావడంతో కేసీఆర్‌కు ఇప్పుడు కాంగ్రెస్ అవసరం లేకుండాపోయింది. తెలంగాణలో ఇక రాజకీయంగా పాతుకుపోవాలన్న లక్ష్యంతో కేసీఆర్ కాంగ్రెస్‌లో విలీనం వుండదని తెగేసి చెప్పాడు. దీంతో కాంగ్రెస్ పరిస్థితి ఘోరంగా మారింది. రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది.

## 'అంతర్'జాతీయం

- రాంవిలాస్ పాశ్వాన్ నేతృత్వంలో లోక్‌జనశక్తి పార్టీ బీజేపీతో పొత్తు కుదుర్చుకుంది. బీహార్‌లో 7లోక్‌సభ స్థానాల నుండి ఎల్‌జెపి పోటీ చేయనుంది.
- మాజీసైన్యాధిపతి జనరల్ వి.కె.సింగ్ బీజేపీలో చేరారు. బీజేపీ మాత్రమే స్థిరమైన బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదని, జాతీయ ప్రయోజనాల కోసం పనిచేసేది బీజేపీయే కాబట్టి అందులో చేరానని వి.కె.సింగ్ వెల్లడించారు.
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 50మంది స్వతంత్ర అభ్యర్థుల తరపున ప్రచారం చేయనున్నట్లు అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అన్నాహజారే ప్రకటించారు. రాజకీయపార్టీలకు తాను సూచించిన 17సూత్రాల అజెండాను ఈ 50మంది అభ్యర్థులు అంగీకరించారని, అందుకే వారి తరపున ప్రచారం నిర్వహిస్తానన్నారు.
- ఇండియన్ ముజాహిదీన్ సహవ్యవస్థాపకుడు యాసిన్‌భత్కల్‌కు చెందిన కర్ణాటకలోని ఓ అత్తరుదుకాణం ఉగ్రవాద కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేదని జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది.
- చైనాలోని యాన్నన్‌ప్రావిన్స్ రాజధాని కున్‌మింగ్ సిటీ రైల్వేస్టేషన్‌లో తీవ్రవాదులు జరిపిన దాడిలో 27మంది మరణించగా 109మంది గాయపడ్డారు. ఆల్‌ఖైదాతో సంబంధాలున్న తూర్పు టర్కిస్థాన్ ఇస్లామిక్ ఉద్యమకారులు ఈ దాడికి తెగబడినట్లుగా అనుమానిస్తున్నారు.
- ఈ నెల 3వ తేదీ పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని న్యాయస్థానంలో సాయుధ దుండగులు జొరబడి విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ఓ న్యాయమూర్తితో సహా 11మంది మరణించారు. 25మందికిపైగా గాయపడ్డారు.
- ఉక్రెయిన్‌పై రష్యా సైనిక దాడికి దిగింది. రష్యాదళాలు క్రిమియా పట్టణానికి సమీపంలోని నౌకాస్థావరాన్ని స్వాధీనం చేసుకున్నాయి. అయితే రష్యా దాడిని అమెరికా, బ్రిటన్‌లు వ్యతిరేకిస్తున్నాయి.
- దేశంలో మెట్రో రైలు రంగాన్ని అభివృద్ధి చేసిన మెట్రోమ్యాన్ ఈ.శ్రీధరన్‌కు భారతరత్న అవార్డునివ్వాలని సమాజ్‌వాదీ పార్టీ సారథి ములాయంసింగ్ యాదవ్ డిమాండ్ చేసారు.
- బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఆసియాకప్ క్రికెట్ పోటీలలో ఇండియా ఇంటిదారి పట్టింది. పాకిస్థాన్, శ్రీలంకలు ఫైనల్స్‌కు చేరాయి.
- ఢిల్లీ మాజీముఖ్యమంత్రి షీలాదీక్షిత్ కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు. కేరళ గవర్నర్‌గా వున్న నిఖిల్‌కుమార్ వచ్చే లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేసే ఉద్దేశ్యంతో రాజీనామా చేసారు.
- యాసిడ్ దాడికి గురై, ఆ తరహా దాడులకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపిన ఢిల్లీకి చెందిన లక్ష్మీ అనే మహిళకు ప్రతిష్టాత్మకమైన అమెరికా ప్రభుత్వ అంతర్జాతీయ ధీరవనిత అవార్డు లభించింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- మేమొచ్చాక సవరణలు చేస్తాం. – ఏ.పి విభజనపై వెంకయ్య.
**వ్యాఖ్య :- *అప్పటిదాకా గాయాలను అలా ఉంచుకోవాల్సిందేనా?***

వార్త :- జైరాం రమేష్ వార్డుమెంబర్‌గా కూడా గెలవలేదు. – ఎంపీ హర్షకుమార్.
**వ్యాఖ్య :- *కాబట్టే కదా జాతీయ నాయకుడైంది.***

వార్త :- ధనకాంక్ష కలిగిన నేత జగన్. – జేసీ దివాకర్‌రెడ్డి.
**వ్యాఖ్య :- *రాజకీయాల్లో ధనకాంక్ష లేనివాళ్లు కూడా వుంటారా?***

వార్త :- సీపీఎంతోనూ పొత్తు లేనట్లే. – సీపీఐ నారాయణ.
**వ్యాఖ్య :- *జోగిజోగి రాసుకుంటే బూడిదే కదా రాలేది.***

వార్త :- ఒకరోజు రిక్షావాలానవుతా! – రాహుల్‌గాంధీ.
**వ్యాఖ్య :- *ఎన్నికల తర్వాత రోజూ తొక్కండి... ఎలాగూ ఖాళీయేకదా!***

వార్త :- తెరాసను కాంగ్రెస్‌లో విలీనం చేయం. – కేసీఆర్.
**వ్యాఖ్య :- *కాంగ్రెస్‌కు కరెక్ట్‌గా బుద్ధిచెప్పారు.***

వార్త :- రాష్ట్ర విభజన మంచికే. – జేడీ శీలం.
**వ్యాఖ్య :- *రాజకీయ నాయకుల మంచికా?***

వార్త :- వచ్చే ఎన్నికలలో పోటీ చేయను. – వట్టి వసంతకుమార్.
**వ్యాఖ్య :- *డబ్బు దండగ ఎందుకనా?***

వార్త :- రాష్ట్రాన్ని దుబాయ్, వాషింగ్టన్‌లా మారుస్తా. – జగన్.
**వ్యాఖ్య :- *ఈ రాష్ట్రాన్ని రాష్ట్రంగానే ఉంచండి చాలు...***

వార్త :- కాంగ్రెస్ ఎంపీలకు సోనియా విందు.
**వ్యాఖ్య :- *వీడ్కోలు విందులాగుంది.***

వార్త :- అవును... రోహిత్ నా కుమారుడే. – మాజీగవర్నర్ తివారి.
**వ్యాఖ్య :- *కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు రావడమంటే ఇదే!***

వార్త :- రాష్ట్రవిభజనపై సుప్రీంలో కిరణ్ పిటిషన్.
**వ్యాఖ్య :- *చివరిబంతి అంటే ఇదా?***

వార్త :- ఏ మొహం పెట్టుకుని తిరుగుతున్నారు. – జైరాంపై కోడెల మండిపాటు.
**వ్యాఖ్య :- *అందుకేగా కళ్లకు అద్దాలు పెట్టుకుని తిరుగుతున్నారు.***

వార్త :- కేసీఆర్‌కు నేనే రాజకీయ గురువు. – చంద్రబాబు.
**వ్యాఖ్య :- *కాబట్టే కదా గురువును ముంచిన శిష్యుడయ్యాడు.***

# సమాజశ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## -హై కోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్



నెల్లూరు జిల్లా కోర్టులోని న్యాయవాదుల సమావేశ మందిరంలో ఈ నెల 1న బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ చంద్రకుమార్ ముఖ్యఅతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరుతో తనకు విడదీయరాని అనుబంధం వుందని అన్నారు. ఏఎస్‌పేట దర్గా, గొలగమూడి దేవాలయాల ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం పాఠశాలలను నిర్మించడం తనకు ఎంతో ఆనందం కలిగించిందని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ పది మందికి ఉపయోగపడే పనులు చేస్తూ, మంచిగా ఆలోచన కలిగి సేవాకార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. సమాజ శ్రేయస్సు కోసం అందరం కృషి చేద్దామని అన్నారు. పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేసి వారి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ పౌరుల ప్రాథమిక హక్కులకు, మానవ హక్కులకు భంగం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న సీనియర్ న్యాయవాదులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, అరిగెల సాయి, విజయ, కోటయ్య, సన్నే సాహెబ్, వడ్డే శ్రీనివాసరావు, శివకామేశ్వరి, శ్రీహరిలు జస్టిస్ చంద్రకుమార్ సేవలను కొనియాడగా బార్ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యం తదితరులు ఆయనను దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కనకదుర్గారావు, న్యాయమూర్తులు జగదీష్ చంద్రరావు, నరసింహరాజు, పాపిరెడ్డి, రామచంద్రమూర్తి, ఆనంద్, మధుసూదన్ రావు, రామకృష్ణ రజని, చిన్నబాబు, హేమలత, ప్రవీణ్‌కుమార్, వెన్నెల, పద్మ, పద్మాని, సంధ్యారాణి, పద్మశ్రీలు పాల్గొన్నారు.

# మీరాకుమార్‌పై పరుశురామాస్త్రం



నెల్లూరుజిల్లా బుచ్చిమండలం కొండూరుపాలెంకు చెందిన బీహార్ క్యాడర్ ఐఏఎస్ అధికారి, మాజీప్రిన్సిపల్ సెక్రటరీ కర్రా పరుశురామయ్య వచ్చే ఎన్నికల్లో స్పీకర్ మీరాకుమార్‌పై పోటీకి దిగనున్నారు. ముఖ్యకార్యదర్శి హోదాలో ఆయన ఇటీవలే స్వచ్ఛంద పదవీవిరమణ చేసారు. అనంతరం జేడీయూలో చేరారు. ఆ పార్టీ లోక్‌సభ అభ్యర్థిగా ప్రస్తుతం మీరాకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం నుండి పోటీ చేయబోతున్నారు.

# సింహపురి హాస్పిటల్స్‌లో ఉచిత వైద్యం

ప్రపంచస్థాయి ప్రమాణాలతో నెల్లూరు జిల్లా వాసుల ఆరోగ్య పరిరక్షణ కోసం నెల్లూరు బైపాస్‌లో చింతారెడ్డిపాళెం క్రాస్ రోడ్ వద్ద వెలసిన సింహపురి హాస్పిటల్స్‌లో ఈ నెల 10వతేదీ వరకు ఉచిత వైద్య సేవలు, వైద్య పరీక్షలపై 50%రాయితీ కల్పించారు. రిజిస్ట్రేషన్ కోసం 0861-6680100, 8008104209, 9440922982 నెంబర్లలో సంప్రదించాలని, హాస్పిటల్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హాస్పిటల్‌లో నిమ్స్, హైదరాబాద్ నుంచి వచ్చిన డా॥.టి.గోపాలకృష్ణయ్య, ఎముకలు, కీళ్ళు, నరముల వైద్య నిపుణులుగా, డా॥ కె.శశిధర్, ఫెల్లో ఇన్ జాయింట్ రీప్లేస్‌మెంట్, ఉస్మానియా హాస్పిటల్, హైదరాబాద్ నుంచి వచ్చిన డా॥. ఎమ్.లక్ష్మీ రమేష్ మూత్రపిండాలు, మూత్ర కోశములు, సెక్స్ సమస్యల వైద్య నిపుణులుగా, డా॥పి.రమేష్‌బాబు, మధుమేహం, రక్తపోటు వైద్య నిపుణులుగా, రాయవేలూరులోని సిఎమ్‌సి నుంచి వచ్చిన డా॥. వై.పవన్‌కుమార్‌రెడ్డి జీర్ణ సంబంధిత వ్యాధుల నిపుణులుగా పని చేస్తున్నట్టు తెలిపారు. నెల్లూరు జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు.

# కాన్పులు పెంచండి



సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

విధిగా ప్రభుత్వ ఆసుపత్రులలోనే గర్భిణీ స్త్రీలు కాన్పులు చేసుకొనేలా చూడాలని దీనిపై నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు.

ఈ నెల 1న కలెక్టర్ బంగ్లాలో వైద్యఆరోగ్య కార్యక్రమాలపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా కాన్పులు కార్యక్రమాల లక్ష్యాలను సాధించుటలో వెనుకబడిన మండలాలు ప్రత్యేకశ్రద్ధ వహించి ఆయా సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కాన్పులు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంపై పూర్తిగా గర్భిణీస్త్రీలకు అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పులు జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్కడైనా వైద్యాధికారులు ఖాళీలుంటే వెంటనే భర్తీచేసి వైద్యసేవా కార్యక్రమాలు పటిష్టంగా అమలయ్యేలా చూడాలన్నారు. విధులకు గైర్హాజరైన డాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా నియమించిన డాక్టర్లు తమ విధులలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, వారు రాని పక్షంలో వారి స్థానంలో వేరే వారిని నియమించి పూర్తిస్థాయిలో వైద్యసేవా కార్యక్రమాలు అందేలా చూడాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా॥. కోటేశ్వరి, జిల్లా వైద్య కోఆర్డినేటర్ డా॥ విజయదుర్గ, అదనపు డియంఅండ్‌హెచ్‌ఓ డా॥ పద్మావతి, వివిధ మండలాలకు చెందిన వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికలకు

# రిటర్నింగ్ అధికారులు

నెల్లూరు నగరపాలక సంస్థలోని 54డివిజన్‌లకు 11 మందిని రిటర్నింగ్ అధికారులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1 నుండి 6వరకు డివిజన్‌లకు ఎన్‌డిసిఎల్ మల్లిఖార్జున్, 7 నుండి 12వరకు విజిలెన్స్ ఎన్‌డిసి సత్యనారాయణ, 13 నుండి 18వరకు డిసిఓ కె.బి.మల్లిఖార్జునరెడ్డి, 19 నుండి 24వరకు బీసీ కార్పొరేషన్ ఇ.డి కోటేశ్వరరావు, 25 నుండి 30వరకు డిఆర్‌డిఏ పి.డి చంద్రమౌళి, 31 నుండి 36వరకు ఎస్‌డిసిఎల్‌ఏ ఎం.బాబయ్య, 37 నుండి 42వరకు సెట్నల్ సిఇఓ కె.శ్రీనివాసరావు, 43 నుండి 48వరకు డిడబ్ల్యుడి పిడి కె.రమేష్‌కుమార్, 49 నుండి 54వరకు ఎస్సీ కార్పొరేషన్ ఇడి సోమయ్యలను రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. డిపిసి జనరల్ మేనేజర్ వి.సుధాకర్, ఎన్‌డిసిఎల్‌ఏ వై.వెంకటేశ్వర్లులను రిజర్వ్‌లో ఉంచారు. వీరితోపాటు మరో 11మందిని సహాయఅధికారులుగా నియమించారు.




# మోడీ కోసం శ్రమిద్దాం

భారతదేశానికి నరేంద్రమోడీని ప్రధానమంత్రిని చేసే లక్ష్యంతో ప్రతి బీజేపీ కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశం 4వ తేదీ కావలిలోని నమస్కార్ హోటల్‌లో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సురేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశమంతా మోడీ వైపే చూస్తోందని, సుసంపన్నమైన భారత్ మోడీతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలను నిర్లక్ష్యం, ఆలస్యం చేయడం వల్ల రాష్ట్రానికి కేంద్రం నుండి రావాల్సిన 2500కోట్ల నిధులు ఆగిపోయాయన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఘోర వైఫల్యం చెందాయన్నారు. రానున్న మున్సిపల్, సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కందుకూరు వెంకట సత్యనారాయణ, కాకు విజయలక్ష్మి, జి.భరత్, రంగారెడ్డి, మిడతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెంగాళమ్మ సన్నిధిలో

# చాగంటి



ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు మంగళవారం సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి కల్యాణ మండపాన్ని పరిశీలించారు. ఏప్రిల్ నెలలో రెండురోజుల పాటు ఇక్కడే వుండి భక్తులకు ప్రవచనాలను అందిస్తానని ఈ సందర్భంగా చాగంటి హామీ ఇచ్చారు.

# అంధులకు ముస్లిం యూత్ పండ్లు

నెల్లూరు పెద్దాసుపత్రి ఎదురుగా వున్న అంధుల పాఠశాలలో ఈ నెల 4న ముస్లిం యూత్ పండ్లు, బిస్కెట్స్, బ్రెడ్‌లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో యూత్ నేత ఖలీద్ దంతవైద్యశాల వైద్యులు డా॥ అస్లాం, ఇస్హాక్, కె.జి.ఎన్.ఫ్రూట్స్ మున్న, అన్వర్, కంతర్, అబ్దుల్లా, ఉమర్, సోయల్ తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# చిన్ని పెంచలయ్య



నెల్లూరు కామాటివీధికి చెందిన మాజీ కార్పొరేటర్ వేలూరు చిన్ని పెంచలయ్య ఈ నెల 1న మరణించారు. 43వ డివిజన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ గత కార్పొరేషన్ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా గెలుపొంది సేవలందించిన చిన్ని పెంచలయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని విజయా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. ఆదివారం నెల్లూరులోని స్వగృహంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.


**FORM IV**

(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 2. Periodicity of its Publication | : | Weekly |
| 3. Printer's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. Publisher's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. Editor's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. Name and Address of individuals who won the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)

01.03.2014 **SIVA PRABHATH REDDY.T**



ఇటీవల విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్టులో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైకాపాలో చేరిన చింతారెడ్డిపాలెం మాజీ ఎంపీటీసీ సికిందర్‌రెడ్డి, పక్కన నెల్లూరురూరల్ నియోజకవర్గ వైయస్సార్‌సీపీ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.

# నెల్లూరంతా పసుపుమయం

చాలా ఏళ్ల తర్వాత నెల్లూరులో తెలుగుదేశంపార్టీ సందడి కనిపించింది. నగరమంతా పసుపుమయం అయ్యింది. పసుపు తోరణాలతో నగరం కళకళలాడింది. ఈ నెల 5వ తేదీన నెల్లూరులో చంద్రబాబు ప్రజాగర్జన సందర్భంగా నెల్లూరంతా పసుపు పులుముకున్నట్లయ్యింది. పసుపుజెండాలు, పసుపు రంగు ఫ్లెక్సీ కటౌట్‌లు, పసుపురంగు వాల్‌పోస్టర్లు... ఏ రోడ్లో చూసినా ఇవే కనిపించాయి. 2004లో అధికారం కోల్పోయిన తర్వాత తెలుగుదేశం పార్టీ పరంగా ఈ స్థాయిలో నెల్లూరులో సందడి కనిపించింది ఇప్పుడే!

జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల నుండి భారీగా తెలుగుదేశం కార్యకర్తలను నెల్లూరుకు తరలించారు. అన్ని డిపోల పరిధిలో కూడా నాయకులు కార్యకర్తలను తరలించడానికి ప్రత్యేకంగా బస్సులు, ఇతరత్రా వాహనాలను ఏర్పాటు చేయడం జరిగింది. నెల్లూరులోని అన్ని జంక్షన్ల వద్ద మహనీయుల విగ్రహాల చుట్టూ పసుపురంగుల జెండాలతో అల్లేసారు. ట్రంకురోడ్డు పొడవునా డివైడర్ల మీద లాలీపాప్ బోర్డ్సుకు చంద్రబాబు ఫ్లెక్సీలను అంటించగా, నెల్లూరులోని అన్ని ప్రకటనబోర్డులు చంద్రబాబు ఫోటోలతో నిండిపోయాయి. గత పదేళ్లుగా పార్టీ కోసం రూపాయి ఖర్చుపెట్టని నాయకులు కూడా ఇప్పుడు బాగానే ఖర్చు పెట్టడం కనిపించింది.

నెల్లూరు కబుర్లు

## సంస్కృతిజ్ఞాన పరీక్షలో వెలిగిన 'రత్నాలు'



విద్యార్థులను అభినందిస్తున్న రామ్మూర్తినాయుడు

గాయత్రి పరివార్ నిర్వహించిన భారతీయ సంస్కృతి జ్ఞానవరీక్షలో నెల్లూరు దర్గామిట్ట సరస్వతీనగర్‌లోని రత్నం ఒలింపియాడ్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. విద్యార్థులు శుభదీప్, వెంకట్‌వర్మ, చరిత్, వంశీ, రఘుపవన్‌లు ఈ నెల 4న జిల్లా కలెక్టర్ శ్రీకాంత్, నెల్లూరు నగర మాజీశాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిల చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ కె.వి.డి.మనోజ్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ అభినందిస్తూ జ్ఞాపికను అందించారు. స్కూలు డైరక్టర్స్ డా॥ కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్, జి.యం రామ్మూర్తినాయుడులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

## క్రైమ్ ఓఎస్‌డిగా శిల్పవల్లి

నెల్లూరు క్రైమ్ ఓఎస్‌డిగా కె.శిల్పవల్లిని నియమిస్తూ డిజిపి ప్రసాదరావు ఉత్తర్వులు జారీచేసారు. విజయవాడకు చెందిన శిల్పవల్లి 2010 బ్యాచ్ గ్రూప్-1 అధికారిణి. తొలుత చేవెళ్ల డిఎస్పీగా పనిచేసారు. ఆ తర్వాత గ్రేహౌండ్స్ శిక్షణలో ఉన్నారు. ఇప్పుడు నెల్లూరుకు బదిలీ అయ్యారు. గతంలో సీసీఎస్‌కు ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌ఓగా వ్యవహరించేవారు. ప్రస్తుతం సీసీఎస్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో ఐదుగురు ఇన్స్‌పెక్టర్లు, పదిమంది ఎస్‌ఐలు ఉన్నారు. ఇప్పటి నుండి ఓఎస్‌డి సీసీఎస్‌కు ఎస్‌హెచ్‌ఓగా వ్యవహరిస్తారు.

## స్టేడియం వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు



నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1న ఉచితంగా రక్తపోటు, మధుమేహ పరీక్షలు దాదాపు 200 మంది వాకర్స్‌కు నిర్వహించారు. డాక్టర్లు సత్యనాథ్, అంకిరెడ్డి, యంయస్ రెడ్డి, శ్రీనివాసకుమార్, దొరస్వామినాయుడు, నాగేశ్వరరావులు రక్తపోటును పరీక్షించగా, పద్మావతి డయాగ్నొస్టిక్స్ సిబ్బంది మధుమేహ పరీక్షలు చేసారు. అసోసియేషన్ అధ్యక్షుడు పూండ్ల దయాకర్‌రెడ్డి, కార్యదర్శి శేషగిరిరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో డి.రమణయ్య, ప్రసాద్‌బాబు, అమరేంద్రరెడ్డి, జయదేవ్, సుందరరామిరెడ్డి, నిర్మల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆంగ్లంలో నేతాజీ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎం.వి.సుబ్బారెడ్డి

స్టేట్‌లెవల్ ఇంగ్లీష్ ప్రొఫిసియెన్సీ టాలెంట్ టెస్ట్ ఫలితాలలో శ్రీనేతాజీ(ఎంఎస్‌ఆర్) పైలట్ హైస్కూల్ విద్యార్థులు స్టేట్ 2, 3 ర్యాంకులు సాధించినట్లు స్కూలు కరస్పాండెంట్ ఎం.వి. సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఇంగ్లీషు లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ వారు 2013డిసెంబర్ 1న నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో తమ స్కూలు విద్యార్థులు ఎ.వర్షిణి(4వ తరగతి) స్టేట్ 2వ ర్యాంకు మరియు యస్.రితీష(7వ తరగతి) స్టేట్ 3వ ర్యాంకు పొందారని విద్యార్థినులను వారి తల్లిదండ్రులను అభినందించారు.

### నాలుగు అంతర్జాతీయ సదస్సులకు
## డాక్టర్ జగదీష్



ప్రవంఖ ప్రత్యామ్నాయ ఇంధనవనరుల నిపుణుడు, నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్‌కు చెన్నైలో ఈనెల17 నుండి 18 వరకు జరిగే ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, జూన్10 నుండి 11 వరకు బ్యాంకాక్‌లో జరిగే క్లీన్ పవర్ ఏషియా 2014, గ్వాంగ్‌జు, దక్షిణ కొరియాలో జూన్ 5 నుండి 20 వరకు జరిగే 20వ ప్రపంచ హైడ్రోజన్ సదస్సు 2014 మరియు ఆగష్టు 26 నుండి 28 వరకు అట్టావా, కెనడాలో జరిగే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ వాటర్, ఇన్‌ఫర్మాటిక్స్, సస్టైనబిలిటీ అండ్ ఎన్విరాన్‌మెంటు అంతర్జాతీయ సదస్సులలో పాల్గొనేందుకు ఆహ్వానాలందాయి.

### తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్‌గా
## విజయచందర్

తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్‌గా ఎల్.విజయచందర్ ఈ నెల 1న నెల్లూరులో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సందర్భంగా ఇక్కడ పనిచేస్తుండిన భాను ప్రసాద్ బదిలీకావడంతో ఆయన స్థానంలో ఎల్.విజయచందర్ బదిలీపై వచ్చారు.

## సోమశిల ఎస్‌ఇగా షాబ్జాన్

జిల్లాలోని సోమశిల ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా షాబ్జాన్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. నెల్లూరులోని కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న షాబ్జాన్‌ను కార్యాలయంలోని అన్ని విభాగాల ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్పీని కలిసిన ఎక్సైజ్

జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్‌ను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీతో చర్చించేందుకు వారు వచ్చారు. ఎస్పీని కలిసిన వారిలో డిప్యూటీ కమీషనర్ చైతన్యమురళి, సూపరింటెండెంట్లు కె.శ్రీనివాస్, సుబ్బారావులు ఉన్నారు.

### రద్దయిన బదిలీతో
## తిరిగొచ్చిన డీఎస్పీ రాంబాబు



ఎన్నికల బదిలీల్లో భాగంగా చేసిన నెల్లూరు గ్రామీణ డీఎస్పీ రాంబాబు బదిలీ రద్దయింది. ఫిబ్రవరి 28న ఎన్నికల కమీషన్ ఆయన్ను బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించడంతో వెంటనే ఆయన హైదరాబాద్ వెళ్ళారు. లా అండ్ ఆర్డర్‌లో మూడేళ్ళు పనిచేసిన వారే బదిలీకి అర్హులు. కాని ఆయన గత మూడేళ్ళకాలంలో పదినెలలు మాత్రమే రాంబాబు డీఎస్పీగా పనిచేసారు. స్పెషల్ బ్రాంచ్‌లో 11నెలలు పని చేసారు. ఈ 11నెలల కాలాన్ని కోవూరు సిఐగా పని చేసినట్టు పొరపాటు పడి ఉత్తర్వులు జారీ చేసారు. ఈ విషయాన్ని ఆయన డీజీని కలిసి తెలపడంతో రికార్డులను పరిశీలించిన తదుపరి ఆయన బదిలీని రద్దు చేసారు.

## కొత్త అధ్యక్షుడికి అరుణమ్మ అభినందనలు



జిల్లా కాంగ్రెస్ కమిటీ కొత్త అధ్యక్షులుగా నియమితులైన కొడవలూరు ధనుంజయరెడ్డిని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి పందిళ్లపల్లి అరుణమ్మ ఈనెల 4వతేదీన నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లోని ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ పటిష్టత కోసం ధనుంజయరెడ్డి చేసే కృషికి తాము అండగా ఉంటామని అరుణమ్మ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో పార్టీని విజయపథంలో నడపగల సామర్థ్యం ధనుంజయరెడ్డికుందని, పార్టీకి ఆయన పూర్వవైభవం తెస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేసారు.

## రక్తనాళాల శస్త్ర చికిత్సలో సరికొత్త ఆవిష్కరణలు

నెల్లూరు ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో అపోలో ఆసుపత్రి సమాచార కేంద్రంలో ఈ నెల 2న చెన్నై అపోలో ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్, వాస్కులర్ సర్జన్ డాక్టర్ వి.బాలాజీ రక్తనాళాల శస్త్ర చికిత్సలో సరికొత్త ఆవిష్కరణల గురించి వివరించారు. శరీరంలో ప్రధాన భాగాలైన మెదడు, గుండె తప్ప మిగిలిన భాగాల్లో నొప్పితో బాధ పడేవారు కారణాలు తెలియక రకరకాల వైద్యులను సంప్రదిస్తుంటారని, దీనికి సంబంధించి ప్రత్యేకంగా ఎండోవాస్కులర్ సర్జన్ వుంటారని చాలా మందికి తెలియదని పేర్కొన్నారు. రక్త సరఫరా నిలిచిపోతే తద్వారా రక్తనాళాలలో ఏర్పడే ఇబ్బందులను గుర్తించి ఎండోవాస్కులర్, సూక్ష్మరంధ్రాల పద్ధతి ద్వారా శస్త్ర చికిత్సలు చేసి నివారించవచ్చన్నారు. ఈ శస్త్ర చికిత్స వలన రోగి ఎటువంటి ఇబ్బంది పడకుండా మూడు రోజులకే తన పనులను సాధారణంగా చేసుకోగలుగుతాడని తెలిపారు.

## అలరించిన సైన్స్ ఎక్స్‌పో



ఏ.సి.నగర్‌లోని శ్రీ వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూలులో 'సైన్స్‌ఎక్స్‌పో' ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వి.ఆర్.కాలేజీ ఫిజిక్స్ హెచ్‌ఓడి డా॥ యం.సుబ్రహ్మణ్యం విచ్చేసి మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శన చాలా అవసరమని సూచించారు. ఇందులో భాగంగా ప్రదర్శించిన 'తిరుమల నమూనా' అందరిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో స్కూలు స్థాపకులు బి.యల్లమందయ్య, ప్రెసిడెంట్ డాక్టర్ సి.వి.సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ బి.వి.శివరాంలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను వదిలి...
# కాకాణి వైపు కదిలి...



వైయస్సార్‌సీపీలో చేరిన దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యకర్తలతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సింహపురి సమాచారం

సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి టీడీపీలో చేరడంతో ఆ నియోజకవర్గంలో వున్న కాంగ్రెస్ కేడర్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ వైపు పరుగులు తీస్తోంది. ఈ పరంపరలో భాగంగానే ముత్తుకూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, పెన్నాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీఛైర్మెన్ దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైకాపాలో చేరారు. ముత్తుకూరు మండలం దువ్వూరు వారిపాలెంలో జరిగిన ఈ సభలో చంద్రశేఖర్‌రెడ్డితో పాటు వెంకటరమణారెడ్డి, దయాకర్, మురళీ, సుబ్రహ్మణ్యం, శోభన్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, టంగుటూరు పద్మనాభరెడ్డి, పెదమల్లు రమణారెడ్డి, దండు శేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, బి.వెంకటరమణయ్య, ఇసనాక చంద్రశేఖర్‌రెడ్డి, వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి వెంకురెడ్డి, మరుపూరు గోపాల్‌రెడ్డి, కొడవలూరు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు బుద్ధొచ్చింది సోమిరెడ్డి



తెలుగుప్రజలను అన్యాయానికి గురిచేసిన కాంగ్రెస్‌పార్టీకి కేసీఆర్ తగిన గుణపాఠం చెప్పాడని తెలుగుదేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్‌ను నమ్ముకుని రాష్ట్ర విభజన చేసి తెలుగుజాతికి ద్రోహం చేసిన కాంగ్రెస్‌కు కేసీఆర్ తగినశాస్తి చేసారన్నారు. తెలంగాణలో కేసీఆర్‌కు గాని, కాంగ్రెస్‌కు గాని భవిష్యత్ లేదన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పటిష్టంగా వుందని, రెండు రాష్ట్రాలలోనూ తెలుగుదేశమే అధికారంలోకి వస్తుందన్నారు. తెలుగుదేశం నుండి ఒకరిద్దరు వెళ్లిపోయినంతమాత్రాన బాధపడాల్సిన పని లేదని, క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ ఎంతో పటిష్టంగా వుందన్నారు. సీమాంధ్ర పునర్నిర్మాణమే కాదు రెండు రాష్ట్రాల అభివృద్ధికి తెలుగుదేశంపార్టీ కట్టుబడి వుందన్నారు.

ఇరు ప్రాంతాలలో ఉన్న వనరులను ఉపయోగించుకుంటే ఈ రెండు రాష్ట్రాలను దేశంలోనే సుసంపన్న మైన రాష్ట్రాలుగా అభివృద్ధి చేసుకోవచ్చని, అలా చేయగల సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు.

# జగన్‌తోనే జనంలో ఆనందం



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్

నెల్లూరునగరంలోని 46వ డివిజన్‌లోని జయలలిత నగర్‌లో స్థానికులతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ ఆత్మీయసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి విజయం సాధించే విధంగా అందరూ కష్టపడి పని చేయాలని అన్నారు. గతంలో మహానేత వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వలన చాలామంది పేదప్రజలు సుఖసంతోషాలతో సమృద్ధిగా జీవించారని, ఆ మహానేత మరణం తరువాత ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. చంద్రబాబు ఈ రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తానని ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారని చెప్పారు. గతంలో 9సంవత్సరాలు పాలించిన చంద్రబాబు ప్రజలకు పనికివచ్చే ఒక్క సంక్షేమ పథకం ప్రవేశపెట్టలేదని అన్నారు. రానున్న రోజుల్లో ఈ రాష్ట్ర ప్రజలకు నీతివంతమైన పాలన మన నాయకుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకువస్తారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ముప్పసాని శ్రీనివాసులు, మక్బుల్, వందవాసి రంగా, సుబ్రహ్మణ్యం, షాభాషా, వెంకయ్య, నారాయణ, లతీష్ మరియు స్థానికులు పాల్గొన్నారు.

## అదిరా బదిరా జొన్నవాడ ఛైర్మెన్ ఎన్నిక

జొన్నవాడలోని శ్రీ కామాక్షితాయి సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం ఛైర్మెన్‌గా అల్లూరు చంద్రశేఖర్‌రెడ్డిని సోమవారం హడావిడిగా ఎంపిక చేసారు. ఆయన 1వతేదీనే ప్రమాణస్వీకారం చేసినట్లు రికార్డుల్లో రాసేసారు. మున్సిపల్ ఎన్నికల కోడ్ రావడంతో ఈ హడావిడి ఎంపిక జరిగింది. దేవస్థానానికి గతంలోనే పాలకవర్గ సభ్యులను ఎంపిక చేసారు. జక్కం కృష్ణారెడ్డిని ఛైర్మెన్ చేయాలనుకున్నారు. అయితే ఆయన ఇప్పుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో పాటు వెళ్లిపోతుండడంతో ఆయన బదులు అల్లూరు చంద్రశేఖర్‌రెడ్డిని ఛైర్మెన్‌ను చేసేసారు.

# ఇక అధికార రాజ్యం



రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన వచ్చింది. అదే సమయంలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ కూడా వచ్చేసింది. దీంతో ప్రజా ప్రతినిధుల అధికారాలకు కత్తెర పడింది. రాష్ట్రపతిపాలనతోనే మంత్రులు మాజీలయ్యారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఇక ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కూడా ఎటువంటి అధికారాలు లేకుండా పోయాయి. ఇక మున్సిపల్ ఎన్నికలదాకే కాదు, సార్వత్రిక ఎన్నికలయ్యే దాకా వాళ్లు ఉత్సవ విగ్రహాలే! ఈ ఎన్నికల తర్వాత రాజెవరో, రోడ్డునపడేదెవరో ఎవరు చెప్పగలరు!

రాష్ట్రపతిపాలన రావడంతోటే జిల్లా మంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి హంగు ఆర్భాటం పోయాయి. మాజీ మంత్రిగా ఆయన సొంతకారులో తిరుగుతున్నారు. నామమాత్రపు సెక్యూరిటీ మాత్రమే ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వంటివి ప్రజాప్రతినిధులు చేయకూడదు. అవేవన్నా వుంటే అధికారులే చూసుకుంటారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఇక ప్రజాప్రతినిధులకు ఆహ్వానం ఉండదు. అధికారులు కూడా ఇక నాయకుల వెంట తోక ఊపుకుంటూ తిరగడం కుదరదు.

రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో గవర్నర్ రాష్ట్రపతికి ప్రతినిధిగా వ్యవహరిస్తే జిల్లాలో కలెక్టర్ గవర్నర్‌కు ప్రతినిధిగా వ్యవహరిస్తారు. అంటే జిల్లా పరిపాలనంతా కూడా కలెక్టర్ చేతుల్లో ఉన్నట్లే లెఖ్ఖ. అధికారులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు పనిచేయవు. కలెక్టర్ నేతృత్వంలో మున్సిపల్ మరియు సార్వత్రిక ఎన్నికల సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

## రెండు చేతులా సంపాదించి...
# చేయి వదిలేసారు!

కాంగ్రెస్‌లో ఉండి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెండుచేతులా సంపాదించుకున్న నాయకులే ఈరోజు పార్టీకి హ్యాండిచ్చి పోతున్నారని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు.

సోమవారం నెల్లూరు లోని ఇందిరాభవన్‌లో డీసీసీ అధ్యక్షుడు కొడవలూరు ధనుంజయరెడ్డి అధ్యక్షతన ఎన్నికల విషయమై కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివేకా మాట్లాడుతూ కాంగ్రెస్ వటవృక్షం లాంటిదని, ఇలాంటి గడ్డిపోచలు ఎన్ని పోయినా ఆ వృక్షానికేమీ కాదన్నారు. కాంగ్రెస్‌ను వదిలి వెళుతున్న వారిలో ఒకాయన సర్వేపల్లి నియోజకవర్గాన్ని చెరుకురసంలాగా పిండేసాడు. నియోజకవర్గంలో ఒక్క ఎకరా డి-ఫారం పట్టా భూమి లేకుండా కొనేసాడు. ఇంకొకాయన సిమెంట్‌లో సున్నం కలిపి రోడ్లేసి కోట్లు కొల్లగొట్టాడు. కాంగ్రెస్‌పార్టీని మోసం చేసిన వాళ్లెవరూ బాగుపడరని ఆయన ఆదాల, ముంగమూరులనుద్దేశించి విమర్శలు చేసారు. చిరంజీవి నాయకత్వంలో తాము ముందుకెళతామని, తాను నెల్లూరుసిటీ నుండి, తన తమ్ముడు ఆనం విజయ కుమార్‌రెడ్డి నెల్లూరు రూరల్ నుండి పోటీ చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కొత్త డీసీసీ అధ్యక్షుడు ధనుంజయరెడ్డిని నవనాయకుడిగా సంబోధిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



ధనుంజయరెడ్డిని సన్మానిస్తున్న ఆనం వివేకానందరెడ్డి

అధ్యక్షత వహించిన ధనుంజయరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో అందరినీ కలుపుకుని కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు పాటుపడతానన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరినీ కలుస్తానన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, చాట్ల నరసింహారావు, పి.చెంచలబాబుయాదవ్, హరిబాబు యాదవ్ పాల్గొన్నారు.





తెలుగు మా హృదయం!
కలసి వస్తే ప్రగతి!

JAYA NAMA UGADI
FOR TELUGU WE SERVE

తమిళం మా శ్వాస!
కలసి పనిచేస్తే విజయం!




అఖిల భారత తెలుగు ఫౌండేషన్ (రిజిష్టర్)
306, పూందమల్లి జాతీయ రహదారి, కీల్‌పాక్కం, చెన్నై - 6000 010. ఫోన్ 26413300/3344, 98843 13344. ఇ-మెయిల్: profcmkr@yahoo.co.in వెబ్‌సైట్: www.allindiatf.com

తమిళనాట తెలుగువారి త్రిసంగ మహోత్సవము -2014 ఆహ్వానము

ప్రియమైన తెలుగు సోదర, సోదరీమణులారా!
తమిళనాడు చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తెలుగు సంఘములన్నీ ఏకమై ఐకమత్యంతో ఒకే వేదికపై చరిత్రలో పేరుప్రఖ్యాతి గాంచిన స్వాతంత్ర్య సమరయోధులు మావీరులు శ్రీ వీరపాండ్య కట్టబొమ్మన్ మరియు సుపరిపాలనకు ఉదాహరణగా నిలిచిన మహారాజు తిరుమలై నాయకంగారి సంస్మరణ మహోత్సవంతో పాటు జయనామ సంవత్సర ఉగాది పండుగలను కలిపి తమిళనాట తెలుగువారి త్రిసంగ మహోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

16.03.2014, ఆదివారం మ॥ 3గంటల నుండి.
నెహ్రూ ఇండోర్ స్టేడియం, చెన్నై-3.

మన భావితరాలవారి బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బంధుమిత్ర, సకుటుంబ, సపరివార సమేతంగా తప్పనిసరిగా విచ్చేసి ఈ చారిత్రాత్మక మహోత్సవమును జయప్రదం చేయవలసినదిగా కోరుచున్నాము.

ఈ మహోత్సవంలో...
తమిళనాడు గవర్నర్ డా॥ కొణిజేటి రోశయ్య గారు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు శ్రీ జాస్తి చలమేశ్వర్ గార్లతో సహా ఇంకా పలువురు ప్రముఖులు వివిధ రంగాలలో నిష్ణాతులు పాల్గొంటారు.
ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను మరియు వయోవృద్ధులను సత్కరించబడును.
సినీ ప్రముఖులచే సంగీత కార్యక్రమాలు జరుపబడును.

ఈ సంబరాలలో.....
ప్రముఖ గాయకులు శ్రీ జి.ఆనంద్ గారి స్వరమాధురి ఆధ్వర్యంలో శ్రీ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, శ్రీమతి పి.సుశీల, శ్రీ మనో, శ్రీమతి జి.వసంత, శ్రీ భానుచందర్, శ్రీ సిలోన్ మనోహర్, శ్రీమతి ఎస్.పి.శైలజ మొదలగువారు పాల్గొనెదరు.

| ఆచార్య సి.యమ్.కె.రెడ్డి | ఎం.యస్.మనోహరన్ | శిల్ప బి.రంగరాజన్ | మరియు |
|---|---|---|---|
| అధ్యక్షులు | కార్యదర్శి | కోశాధికారి | కార్యకర్తలు |

# టెన్‌జనపథ్‌లో నౌకరులా మారిన కేసీఆర్

గల్పిక 989

అది తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరం. అందులో తెలంగాణ భవన్. టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భుజాల మీద గులాబీ రంగు కండువాలు, చేతుల్లో టీఆర్ఎస్ జెండాలు పట్టుకుని తెలంగాణ సారథి కేసీఆర్ కోసం ఎదురుచూస్తున్నారు. అంతలో బేగంపేట ఎయిర్‌పోర్టు నుండి భారీ ఊరేగింపుతో కేసీఆర్ అక్కడకు చేరుకున్నాడు. తెలంగాణభవన్ వద్ద ఆయన ర్యాలీ వాహనం దిగారు. అక్కడేవున్న ఈటెల రాజేందర్, నాయని నిరసింహారెడ్డి, వినోద్, హరీశ్వర్ రావు, పోచారం శ్రీనివాసరెడ్డిలతో... ఊరేగింపు భలే మస్తుగా జరిగిందిర భాయ్, నాకైతే భలే ఖుషీగా వుంది... ఈ దెబ్బతో నేను తెలంగాణ హీరో అయితిని, ఢిల్లీలో కూడా నాకేం వాల్యూ ఇచ్చింద్రనుకున్నారు, నా ఫ్యామిలీ, సోనియాగాంధీ ఫ్యామిలీ కలిసి ఒకే ఫోటో దిగితిమి... అని అన్నాడు. దానికి వినోద్ వుండి... ఆ ఫ్యామిలీతోనే కాదు ఈ టీఆర్ఎస్ ఫ్యామిలీతో కూడా చివరి ఫోటో దిగరాదె అని కోరాడు. చివరిఫోటో ఏందిరా వినోద్, వీళ్లంతా ఎక్కడికి పోతున్నారు అని కేసీఆర్ అడిగాడు. దానికి ఈటెల రాజేందర్... ఎక్కడికి పోవడమేంటన్నా, కాంగ్రెస్‌లో టీఆర్ఎస్‌ను విలీనం చేస్తానని నువ్వు ఢిల్లీలో చెప్పొస్తివి... ఈ లెక్కన టీఆర్ఎస్ నాయకులుగా మనకు ఇదే చివరి ఫోటో కదా... నువ్వు పార్టీని విలీనం చేస్తే మేం ఎలాగోలా బతికేస్తాం... కాని నిన్ను తలచుకుంటేనే మాకు జాలేస్తుంది. సోనియమ్మ ఇంట్లో నువ్వు కూడా ఆ చిరంజీవి లెక్క మారిపోతావేమోనని భయంగా వుందన్నా అంటూ బిగ్గరగా ఏడవసాగాడు. ఆ మాటతో కేసీఆర్ గుండెల్లో రాయి పడింది. తెలంగాణ ఇచ్చింద్రనే సంతోషంలో పార్టీని విలీనం చేస్తాననే మాటను మర్చిపోయాను... ఇప్పుడు కాంగ్రెస్‌లో విలీనం చేయాలా వద్ద అని కేసీఆర్ ఆలోచనలో పడిపోయాడు. మైండ్‌సెట్ ఒక్కసారిగా మారడంతో ఆయన తెలంగాణభవన్ నుండి నేరుగా ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయాడు. అన్నం కూడా తినాలనిపించలేదు. పి.ఎ బ్రతిమలాడితే రెండు పెగ్గులు మాత్రం తీసుకుని డాబా మీద మంచం వేసుకుని నడుంవాల్చాడు. ఆకాశంలో చంద్రుడిని, చుక్కలను చూస్తూ, కాంగ్రెస్‌లో విలీనమైతే నా పరిస్థితేంటా... అని ఆలోచిస్తూ మత్తుగా నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

హైదరాబాద్‌లో టీఆర్ఎస్ విలీనసభ. సోనియా, రాహుల్, షిండే, ఆంటోని, దిగ్విజయ్‌సింగ్ వంటి కాంగ్రెస్ ఉద్దండులంతా అక్కడ దిగబడ్డారు. ఎల్‌బి స్టేడియంలో ఎక్కడచూసినా కాంగ్రెస్ జెండాలు, సోనియా కటౌట్‌లే! సభ మొదలైంది. కేసీఆర్‌ను వేదిక మీదకు ఆహ్వానించి సోనియా ఆయన మెడలో కాంగ్రెస్ కండువా వేసింది. టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు కేసీఆర్ అక్కడే ప్రకటించారు. ఆ తర్వాత సోనియా తన ప్రసంగంలో కేసీఆర్ తెలంగాణ హీరో అని, ఆయన వల్లే ప్రత్యేకరాష్ట్రం వచ్చిందని చెప్పారు. ఆ మాటతో కేసీఆర్ తెగ మురిసిపోయాడు. షిండే అయితే తన ప్రసంగంలో ఈ తెలంగాణ ప్రక్రియ ఒక మార్కెట్ ప్రాసెస్‌లో జరిగిందని కేసీఆర్ తన పార్టీని మాకు అమ్మినందుకు ప్రతిఫలంగా తెలంగాణను ఇస్తున్నామని, ఇంతటి త్యాగజీవి మీ నాయకుడు కావడం మీ అదృష్టమని చెప్పాడు. తర్వాత విలీనసభను ముగించుకుని ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు.

★★★★★

కాంగ్రెస్ నాయకుడి హోదాలో కేసీఆర్ ఢిల్లీలో అడుగుపెట్టాడు. నేరుగా టెన్‌జనపథ్ వద్దకు వెళ్లాడు. అక్కడే గేటు వద్ద ఉండే వాచ్‌మెన్ కేసీఆర్‌ను చూసి కూడా లేవలేదు. ఇంతకుముందు కేసీఆర్ ఎప్పుడొచ్చినా లేచి సెల్యూట్ కొట్టే వాచ్‌మెన్ ఈరోజు తనను నిర్లక్ష్యంగా చూసేసరికి కేసీఆర్‌కు తెగ బాధేసింది. వాచ్‌మెన్‌ను అదే విషయమై ప్రశ్నిస్తూ... నన్ను చూసి కూడా నువ్వు నిలబడి సెల్యూట్ చేయలేదంటే... నా వాల్యూ పడిపోయిందా? నీ లెవల్ పెరిగిందా? అని ప్రశ్నించాడు. దానికి ఆ వాచ్‌మెన్... ఇంతకు ముందంటే నువ్వు ఇంకో పార్టీ నాయకుడివి... కాని ఇప్పుడు మా పార్టీ వాడివి, కాంగ్రెస్‌లో అయితే నీకంటే నేనే పవర్‌ఫుల్. నేను నిన్నెందుకు లెక్కచేయాలన్నాడు. కేసీఆర్‌కు తల తీసేసినంత పనయ్యింది. అయినా వాచ్‌మెన్‌తో మనకెందుకొచ్చిన గొడవలే అనుకుని లోపలకు వెళ్లాడు. నేరుగా సోనియా గది వద్దకు వెళుతుంటే సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని... ఓయ్ ఇదేమన్నా తిరుమల తిరుపతి దేవస్థానమనుకున్నావా, నేరుగా వెళ్లి చూసిరావడానికి, సోనియాగాంధీ ఇల్లు. అపాయింట్‌మెంట్ ఉందా? అని అడిగారు. అందుకు కేసీఆర్... అపాయింట్‌మెంటేందిరా భాయ్... నిన్నటిదాకా నేను రావడమే మహాభాగ్యమనుకునే వాళ్లు... నేనొస్తే నేరుగా సోనియాగాంధీ వద్దకు తీసుకెళ్లేవాళ్లు, మరిప్పుడు అపాయింట్‌మెంట్ అడుగుతున్నారేంటి అని అడిగాడు. దానికి సెక్యూరిటీ వాళ్లు... అదంతా మీరు ఇంకో పార్టీ నాయకుడిగా ఉన్నప్పుడు. ఇప్పుడు మీరు కాంగ్రెస్ నాయకులు, అపాయింట్‌మెంట్ ఉంటేనే కలుస్తారు. మీ తెలంగాణ వాళ్లే చూడండి... వారంనుండి అపాయింట్‌మెంట్ కోసం ఇక్కడే తింటూ, ఇక్కడే నీళ్లోసుకుంటూ, ఇక్కడే నిద్రపోతున్నారని ఓవైపుకు వేలుపెట్టి చూపించాడు. అక్కడ చూస్తే మధుయాష్కీ, డి.శ్రీనివాస్, సర్వే సత్యనారాయణ వంటి నాయకులున్నారు. కేసీఆర్ వుండి... మరి నాకు అపాయింట్‌మెంట్ ఎప్పుడిస్తారని అడిగాడు. దానికి సెక్యూరిటీ వాళ్లు... ముందు అప్లికేషన్ పెట్టండి, ఏదో ఒకరోజు అపాయింట్‌మెంట్ ఇస్తారని చెప్పాడు. అంతలో ఖాళీ సంచి పట్టుకుని వి.హెచ్.హనుమంతరావు బయటకొచ్చాడు. అక్కడున్న ఒక నౌకర్‌ను పిలిచి, మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు తీసుకురా అని చేతిలో ఓ చీటీపెట్టబోయాడు. ఆ నౌకరు కోపంగా... నాకు వేరే పని వుంది, ఖాళీగా ఉండేవాళ్లకు చెప్పమన్నాడు. వి.హెచ్ అటు ఇటూ చూసాడు. అతని కళ్లకు కేసీఆర్ లడ్డులాగా కనిపించాడు. వెంటనే ఓ కేసీఆరా... ఇటురా అని కేకేసాడు. ఆ పిలుపుకు కేసీఆర్‌కు మండింది. కోపంగా వెళ్లి... ఏంటి హనుమంతన్నా, నీ ఇంట్లో నౌకర్‌ను పిలిచినట్లు... ఏం మర్యాద తెలియదా అని అడిగాడు. మా ఇంట్లో నౌకర్‌ను పిలిచినట్లు కాదు, ఈ ఇంట్లో నౌకర్‌ను పిలిచినట్లే పిలిచాను, ఈ సంచి తీసుకొని మార్కెట్ కెళ్లి ఈ లిస్ట్‌లో ఉన్న కూరగాయలు పట్టుకుని రాపో అని చెప్పాడు. ఆ మాటకు కేసీఆర్‌కు సిగమెక్కింది. ఏమనుకుంటున్నావ్ నా గురించి, నీకు కూరగాయలు మోసేవాడిలాగా కనపడుతున్నానా అని కసురుకున్నాడు. అందుకు వి.హెచ్... నువ్వు పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసినా ఇంకా ఆ టెక్కు తగ్గించుకోలేదా... కాంగ్రెస్‌లోకి వచ్చాక ఇక్కడ నువ్వయినా ఒకటే, ఆ గేటు దగ్గర వాచ్‌మెన్ అయినా ఒకటే. ఆ చిరంజీవి కూడా పార్టీని విలీనం చేసి వచ్చాక మొదట్లో నీలాగే టెక్కుచూపాడు. తర్వాత ఇక్కడ పద్ధతులు, సంప్రదాయాలు అలవాటు చేసుకున్నాడు. నీకు కూడా ఇప్పుడు ఇవన్నీ కొత్తగానే ఉంటాయి, పోనుపోను అలవాటైపోతుంది. ముందు మార్కెట్‌కెళ్లిరాపో... అవతల మేడమ్ లేచే టైమైంది అని అన్నాడు. నేను పోను ఆ చిరంజీవినే పంపు, నాకు రోషం, పౌరుషం ఉన్నాయన్నాడు. దానికి వి.హెచ్... ఇక్కడకొచ్చిన కొత్తల్లో అవి ఎవరికైనా ఉంటాయి, ఆ తర్వాత మనమే వాటిని వదిలేసుకుంటాం. చిరంజీవి వుంటే నీకెందుకు పనిచెబుతాను, అతన్ని ఆల్‌రెడీ చేపలమార్కెట్‌కు పంపించా అని చెప్పాడు. కేసీఆర్‌కు ఏమీ అర్థం కాలేదు. ఇంత బ్రతుకు బతికి చివరకు వీళ్లకు చేపలు, కూరగాయలు తేవాల్సివచ్చిందా అని మధనపడసాగాడు. అంతలో లోపల నుండి సోనియాగాంధీ వచ్చింది. ఈలోపు బయట నుండి అహ్మద్‌పటేల్, దిగ్విజయ్‌సింగ్ కూడా వచ్చారు. కేసీఆర్‌ను చూడగానే దిగ్విజయ్... ఏం కేసీఆర్ ఇలా వచ్చావని అడిగాడు. కేసీఆర్ జేబులో నుండి కొన్ని కాగితాలు తీసి... ఇందులో 60మంది పేర్లున్నాయి... వీరందరికీ టిక్కెట్లు కావాలన్నాడు. వెంటనే అహ్మద్‌పటేల్... ఏ ఊరికి కావాలి, రైలులోనా, ఫ్లైట్‌లోనా? అని అడిగాడు. కేసీఆర్‌కు మండి... నేనడిగింది రైలు టిక్కెట్లు, ఫ్లైట్ టిక్కెట్లు కాదు, పార్టీ టిక్కెట్లు... రేపు ఎన్నికలలో వీళ్లందరికీ టిక్కెట్లిస్తానని చెప్పి ఉన్నా... కాబట్టి వాళ్లను అభ్యర్థులుగా ఖరారు చేయండని అడిగాడు. ఆ మాటతో సోనియా సహా అందరూ విఠలాచార్య సినిమాలో దెయ్యాలు లాగా భీకరంగా నవ్వసాగారు. పిచ్చోడా రేపు నీ టికెట్ నువ్వు తెచ్చుకోవడానికే టెన్‌జనపథ్ చుట్టూ పొర్లు దండాలు పెట్టాలి, మళ్లీ నువ్వు చెప్పినోళ్లకు కూడా టిక్కెట్లా.... నీ చాప్టర్ ఇక్కడితో ముగిసింది. ఇక నువ్వు టెన్‌జనపథ్ బానిసవి అంటూ వాళ్లు ఇంకా పెద్దగా నవ్వసాగారు. ఆ నవ్వుతో కేసీఆర్‌లో ఆవేశం, ఆందోళన పెరిగింది. భయంతో 'నో' అంటూ గట్టిగా అరిచాడు. అలా అరుస్తూనే నిద్రలోనుండి లేచి కూర్చున్నాడు. అతని కేకలకు పక్కనే నిద్రిస్తున్న అతని భార్య జడుసుకుంది. ఏమైందండి అంటూ ఆమె కేసీఆర్ వద్దకు పరుగున వచ్చింది. కేసీఆర్‌కు ఒళ్లంతా చెమట పట్టివుంది. అప్పటిదాకా వచ్చింది కల అని తెలుసుకోవడానికి అతనికి అరగంట పట్టింది. ఆ కలతోనే ఇక సచ్చినా కాంగ్రెస్‌లో విలీనం కాకూడదనుకున్నాడు.

కదంబం

## మరొకడి బతుకులో...

కె.శివారెడ్డి,
హైదరాబాద్, 040 - 24064195

ఎవరికోసం ఎవరూ ఎదురు చూడొద్దు
ఏ వంతెన ఎప్పుడు కూలుతుందో
ఎవరూ చెప్పొద్దు
రాత్రుళ్ళు రమణీయంగా వున్నప్పుడు
చితిమంటలు రేపొద్దు
తొలిపొద్దు కంట్లో వేలు పెట్టొద్దు
విరిగిన వాటిని మళ్ళీ అతకించొద్దు
విరిగినవే మళ్ళీ మళ్ళీ విరుగుతుంటాయి
కాల్లో ముల్లు తీసినా
ముల్లు చివరి అణువు బద్దలవుతుంది
స్టెరిలైజ్ చేసే శక్తి నీకులేదు
అన్ని రకాల ఫోబియాల మధ్య యిరుకున్న
యింగిత ప్రాణివి-
ఫార్ములాలు తెలియని
ఒఠ్ఠి ప్రపంచీకుడవు -
తలుపులు తీసి పడుకోవద్దు
ఆదామును చెడగొట్టిన పాము
నీలోకి జొరబడొచ్చు

అప్పడప్పుడు నిన్ను నీవు చంపొద్దు
మరణించిన తర్వాత మరో ప్రపంచం
గూర్చి మాట్లాడొద్దు
చూపు ఈపిల్‌టవరెక్కి దూకొద్దు
గుడ్డలిప్పదీసి పడుకోవద్దు
పురుగులు పట్టిన దుంగలా బతకొద్దు
అసలేమీ చేయొద్దు
అలా చచ్చినట్టు పడుకో
వేల వేల దెయ్యాలొచ్చి
బృందగానాలాలపిస్తాయి-
ఎవణ్ణీ కాపాడొద్దు
ఎవడికి వాడిగా,
ఎవణ్ణి వాడిగానే బతుకనివ్వు-
ఎవడికి వాడే గురువు
ఎవడికి వాడే శిష్యుడు-
ఎవడి కావడిని వాణ్ణే మోయనివ్వు
ఎవడి కావడిని వాణ్ణే కాయనివ్వు
ఏ ఇద్దరి మధ్యా ప్రవేశించొద్దు
పరమ విధ్వంసాన్ని సృష్టించొద్దు
ఎవడి కోసమూ ఎవడు ఏడ్వొద్దు
నీళ్ళకుండ బుజానెట్టుకుని తిరగొద్దు
బర్రె కుడితి గాబులో ముట్టి ముంచినట్టు
మరొకడి బతుకులో నీ ముట్టె ముంచొద్దు.

## బ్రహ్మాండంగా ముగిసిన శివయ్య బ్రహ్మోత్సవాలు




నెల్లూరుజిల్లా, చిత్తూరుజిల్లాల సరిహద్దులో వున్న ప్రముఖ శైవక్షేత్రం శ్రీకాళహస్తిలో ఫిబ్రవరి 22వ తేదీ నుంచి మార్చి 6వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఏడాదికోసారి జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో శివరాత్రి పర్వదినాన స్వర్ణముఖి నదిలో స్నానమాచరించి శివుని దర్శిస్తే కోటిపాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఆ నమ్మకంతోనే మన రాష్ట్రం నలుమూలల నుంచే కాక పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు శివరాత్రిరోజు శ్రీకాళహస్తికి చేరుకుని శివుని దర్శనం చేసుకుంటారు. ఈ ఏడు కూడా వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. కాని భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు సఫలీకృతులు కాలేకపోయారు. ఆలయంలో క్యూలైన్లు నియంత్రించడంలో ఆలయ ఉద్యోగులు సరైన ఏర్పాట్లు చేయకపోవడం ప్రస్ఫుటంగా కనిపించింది. ఎన్ని కష్టాలు ఓర్చుకొని అయినా శివదర్శనం చేసుకోవాలన్న దృఢసంకల్పంతో వచ్చిన భక్తులు శివరాత్రిరోజు ఆ దేవదేవుని తిలకించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆ భోళాశంకరుని లింగోద్భవ దర్శనం చేసుకున్నవారి కుటుంబం సుఖసంతోషాలతో విలసిల్లుతుందని నమ్మకం. 27వ తేదీ ఉదయం శివునికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించి, రాత్రి 11గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించిన ఆలయ నిర్వాహకులు తిరిగి తెల్లవారుజామున వేడినీళ్లతో అభిషేకించి 3గంటల నుంచి 6గంటలవరకు లింగోద్భవ దర్శనం నిర్వహించారు. 28వ తేదీ రాత్రి వైష్ణవ కోనేరులో తెప్పోత్సవం వైభవంగా జరిపారు. 1న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం భక్తులకు కనువిందుచేసింది. 2న సభాపతి కల్యాణం, ఆనందరాత్రి, 3న కైలాసగిరి ప్రదక్షిణ, ఋషిరాత్రి, 4న ధ్వజావరోహణం, 5న పల్లకీసేవ, 6న ఏకాంతసేవ, 7న శాంతి ఉత్సవాలతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా ముగిసాయి. కార్యక్రమంలో శాసనసభ్యులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి.నాయుడు, మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ కోలా ఆనంద్, కార్యనిర్వహణాధికారి వై.రామచంద్రారెడ్డి, పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్ అజయ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 07.03.2014 నుండి తేది. 13.03.2014 వరకు**

ఈ వారం మేషంలో కేతువు, మిధునంలో గురువు, వృషభ మిధున కర్కాటక రాశులలో చంద్రుడు, తులలో శని కుజ రాహువులు, మకరంలో బుధ శుక్రులు, 11 తేది నుండి కుంభంలో బుధుడు, కుంభ రాశిలో రవి సంచరిస్తారు.

## పంచాంగము

తేది 12 బుధవారం ఉదయం గంట 10.35లకు పుష్యనక్షత్ర వృషభలగ్నమున గృహారంభ వ్యాపార ఉపనయనములు.

### ఫాల్గుణ మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 07 | శుక్ర | షష్ఠి | ఉ॥గం08.03వ॥ |
| తేది. 08 | శని | సప్తమి | ఉ॥గం08.50వ॥ |
| తేది. 09 | ఆది | అష్టమి | ఉ॥గం.09.56వ॥ |
| తేది. 10 | సోమ | నవమి | ఉ॥గం.11.17వ॥ |
| తేది. 11 | మంగళ | దశమి | ప॥గం.01.21వ॥ |
| తేది. 12 | బుధ | ఏకాదశి | సా॥గం.03.25వ॥ |
| తేది. 13 | గురు | ద్వాదశి | సా॥గం.05.32వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అనుకున్న పనులు నిదానంగా జరగడం, ఆటంకాలు కలిగి తొలగడం, తద్వారా టెన్షన్‌గా ఉండటం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరగడం, ఆర్థికవృద్ధి మరియు ఆదాయం స్వల్పంగా పెరగడం జరుగుతుంది. ఓర్పు, విజ్ఞతతో సమస్యలు సర్దుబాటు చేసుకొనవలసి ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి పరంగా గౌరవ ప్రతిష్ఠలు, ఆదాయం బాగుంటుంది. వ్యాపార విస్తరణ, క్రొత్త పెట్టుబడుల ప్రయత్నాలు సాగిస్తారు. వ్యాపార వర్గాలకు అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయడం మంచిది. ఆహ్వానాలు, ముఖ్య పత్రాలు అందుకొంటారు. అనుకున్న పనులు పట్టుదలతో సాధిస్తారు.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులకు పరిస్థితులు అనుకూలించి నెరవేరగలవు. మీ సలహాలు సూచనల వల్ల ఇతరులు లాభం పొందుతారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థికాభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. షేర్లుపెట్టుబడుల మీద ఆదాయం సంతృప్తికరంగా ఉండదు. ఉద్యోగులకు బాధ్యతలు పెరగడం, అధికారులతో సత్సంబంధాలు బలపడడం జరుగుతుంది. పరీక్షలందు ప్రతిభ బాగుంటుంది.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

రాబడికి తగ్గట్లు ఖర్చులు సర్దుబాటు చేసుకొంటారు. వ్యాపార వర్గాలకు ఆర్థికావకాశాలు వాయిదా పడేస్థితి ఉన్నది. వృత్తి పరంగా మంచి వ్యాపకం ఉంటుంది. ఉద్యోగ బాధ్యతలందు అదనపు పనిభారం ఉంటుంది. పెట్టుబడులు, షేర్లపై లాభాలుంటాయి. అవసరమైన ప్రయాణాలుంటాయి. ఇతరులు మీ సహాయాన్ని తక్కువగా భావిస్తారు. విద్యార్థులు ప్రగతి చూపుతారు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కీలక విషయాలపై బాగా ఆలోచించి నిర్ణయం చేయండి. వృత్తి ఉద్యోగాలలో పురోగతి, గౌరవ ప్రతిష్ఠలు బాగుంటాయి. ఆర్థికస్థితి బాగుండి రాబడిపై సంతృప్తి ఉంటుంది. ప్రయాణాలు తప్పని సరిగా ఉంటాయి. ఋణాలివ్వడం, హామీలివ్వడం చేయవద్దు. ఉద్యోగులకు చిన్న అవకాశాలు లభించగలవు. చేపట్టిన పనులను మంచి సమర్థతతో నిర్వహిస్తారు. ఆస్తి వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. సోదరులకు మేలు చేకూరుతుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులు, వ్యాపారులపై అధికారుల దాడులుండవచ్చును. వృత్తి జీవనము వారికి వ్యాపకం బాగుంటుంది. అనుకోని అదనపు ఖర్చులుండినా ఇబ్బందులుండవు. అనుకున్న పనులను ధైర్యముగానే జరుపుకొంటారు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యంకావచ్చును. సభలు, సమావేశాలలో పాల్గొంటారు, మీ నిర్ణయాలే ఆమోదింపబడతాయి. కోర్టు కేసులు వాయిదా పగడలవు.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

క్రొత్త వ్యాపారాలు, ప్రాజెక్ట్‌లు అవకాశాలు, అనుమతులుంటాయి. వ్యాపార వర్గాలకు ఆదాయం బాగుంటుంది. వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకు పనిభారం, అదనపు బాధ్యతలుంటాయి. వృత్తిపరంగా ఆటంకాలు తొలగి వ్యాపకం పెరుగుతుంది. అదనపు ఖర్చులు అనుకోకుండా పైనబడతాయి. చేసే పనులందు టెన్షన్ ఉంటుంది.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఈ రాశి వారికి ఆదాయం సామాన్యం. ఖర్చులు పెరుగుతాయి. ఖర్చులపై అదుపుండదు. ఆర్థిక వ్యవహారాలలో తొందర పడవద్దు, అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. ఆర్థిక ఇబ్బందులుంటాయి. ఇతరుల వ్యవహారాలలోకి పోయి, ఇబ్బందులు పడే అవకాశం ఉన్నది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకున్న పనులు సక్రమంగా జరుగుట, సమస్యలపై సంప్రదింపులు జరుపుట, రాజీ చేసుకొనడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరుగుట, ఆదాయవృద్ధి కలదు. పెట్టుబడులకు అవకాశాలు దొరుకుట, స్థిరాస్తుల మీద ఆదాయముంటుంది. సభలు సమావేశాలలోను, శుభకార్య నిర్ణయంలోను ప్రముఖంగా వ్యవహరిస్తారు. ఇతరుల పనులపై ప్రయాణాలుంటాయి.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

మీరు చేసే అన్ని ప్రయత్నాలకు పరిస్థితులు అనుకూలించగలవు. ఆర్థిక లావాదేవీలు, క్రొత్త వ్యాపార ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి వ్యాపారాలందు ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుండినా సహచరులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. మాట తొందర తగ్గించుకొంటే అందరూ సహకరిస్తారు. పెట్టుబడులు, షేర్ల మీద లాభాలుంటాయి.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పనులు చేసేటప్పుడు ముందు వెనుక ఆలోచించి చేయండి, లేకుంటే విమర్శలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఆర్థిక నిర్ణయాలలోను, పెట్టుబడులందు, వ్యాపార విస్తరణ విషయంలో ఇబ్బందులు రాకుండా చూచుకొనాలి. షేర్లు, పెట్టుబడులందు కొంత నిరుత్సాహం ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు పొందుతారు. వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయం ఉంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి పరంగా వ్యాపకం పెరిగి ఆదాయం పెరుగుతుంది. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు వాయిదా పడవచ్చును. ఖర్చులు పెరిగి ఆర్థికంగా ఇబ్బంది పడతారు. అనుకున్న పనులు జరగడానికి బాగా శ్రమపడవలసి వస్తుంది. కుటుంబంలో చిన్న చిన్న సమస్యలు, ఇబ్బందులుండి సర్దుబాటు కాగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. షేర్లపై లాభాలుంటాయి.

# ఎన్నికలకు సన్నద్ధంకండి

**- నవీన్‌మిట్టల్**



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

ఎన్నికల నిబంధనల మేరకు పురపాలక సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సెక్రటరి నవీన్‌మిట్టల్ పేర్కొన్నారు.

సోమవారం పురపాలక సంఘాల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌పై జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా రాష్ట్రంలోని కార్పొరేషన్‌లకు మరియు మున్సిపాల్టీలకు మార్చి 30న మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిందని, దీనికి ఆయా జిల్లాలలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలలో వార్డులకు సంబంధించి అవసరమైన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే అవసరమైన ఎన్నికల పరికరాలను, ఇవిఎంలను, పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన బ్యాలెట్‌బాక్స్‌లను సిద్ధంగా వుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో 146పురపాలక సంఘాలకు మరియు 3990 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్ అధికారులను, సహాయ పోలింగ్ అధికారులను మరియు ఎన్నికల సిబ్బందిని నియమించుకొని అవసరమైన శిక్షణా తరగతులను నిర్వహించాలన్నారు. మార్చినెల 10వ తేదీన నామినేషన్లు వేయడం, 14వ తేదీన నామినేషన్లకు ఆఖరుతేదీగా నిర్ణయించామన్నారు. 15న నామినేషన్ల పత్రాలు పరిశీలన, 18వ తేదీన నామినేషన్లు ఉపసంహరణ మరియు ఎన్నికలలో వుండే అభ్యర్థుల జాబితా వివరాలు తెలియజేయుట జరుగుతుందన్నారు. 30న పోలింగ్ జరుగుతుందని, ఏప్రిల్ 1వ తేదీన రీపోలింగ్ జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. కనుక జిల్లా అధికారుల షెడ్యూల్ ప్రకారము ఎన్నికల నిబంధనల మేరకు ఎలాంటి సమస్యలు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.యస్.రాజ్‌కుమార్, డిఆర్‌ఓ ఎస్.వి. నాగేశ్వరరావు, డ్వామా పిడి శ్రీమతి గౌతమి, డిఆర్‌డిఏ పి.డి. చంద్రమౌళి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పరిశ్రమలకు పవర్‌కోత

విద్యుత్ కొరత దృష్ట్యా సదరన్ డిస్కమ్ పరిధిలోని పరిశ్రమలకు ప్రతి బుధవారం పవర్‌హాలిడేను ప్రకటించినట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఇ నాగశయనరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా డిమాండ్ల మధ్య వ్యత్యాసం పెరిగింది. దీనివల్ల వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడం కష్టంగా ఉంది. ఇప్పుడు రబీ సీజన్‌లో రైతులకు కరెంట్ ఇవ్వకపోతే చేతికొచ్చిన పంటలు కోల్పోయే ప్రమాదముంది. రబీలో మరింత మెరుగైన విద్యుత్ అందించాలనే ఉద్దేశ్యంతోనే పవర్ హాలిడే ప్రకటించడం జరిగింది. పారిశ్రామిక వేత్తలు దీనికి సహకరించాలని, పవర్ హాలిడే సమయంలో పరిశ్రమల యజమానులు లైట్ల కోసం 10శాతం విద్యుత్‌ను మాత్రమే వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## ఎన్నికల నిఘా వేదికలో చేరండి

# ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి



రానున్న మునిసిపల్, పంచాయితీరాజ్ మరియు సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా, ప్రలోభ రహితంగా ఎన్నికలు జరిగేందుకు ఎన్నికల నిఘా వేదిక కృషిచేయాలని నిర్ణయించింది. మంగళవారం నిర్వహించిన ఎన్నికల నిఘావేదిక సన్నాహక సమావేశంలో ఈమేరకు తీర్మానం చేసారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను ప్రజలకు తెలియజేయడంతోపాటు డబ్బు, మద్యంకు లొంగకుండా ఉండే విధంగా ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్నికలనిఘా వేదిక కన్వీనర్ వి.ఎస్. చలపతి అధ్యక్షత వహించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఎన్నికల నిఘావేదిక సలహాదారు విద్వాన్ కిరణశ్రీ ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నికల నిఘావేదిక జిల్లా ఎన్నికల యంత్రాంగానికి సహకరించి ఎన్నికల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు చేసిన కృషిని వివరించారు. కన్వీనర్ వి.శేషాచలపతి మాట్లాడుతూ ఓటుహక్కు వినియోగించుకోవాల్సిన బాధ్యతను ఓటర్లకు వివరించేందుకు విద్యార్థులను, యువకులను ఎన్నికల నిఘా వేదికలో భాగస్వాములను చేయాలని, ఎన్నికలు స్వేచ్ఛగా ప్రలోభరహితంగా జరగాలని కోరుకునే వారు ఎన్నికల నిఘావేదికలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల నిఘా వేదికలో భాగస్వాములు కావాలనుకునేవారు 9440378331లో కన్వీనరును సంప్రదించాలని తెలిపారు.

సమావేశానికి యానాదయ్య, జయప్రకాష్, చల్లా రమణయ్య, ఉడతా శరత్ యాదవ్, యంద్రపాటి మొరార్జీ, ఎం.రత్నప్రసాద్, గెరిటి చెంచయ్య, బిట్టా సుబ్రహ్మణ్యం, కె.ఎలీషాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సాహస యువకులు దరఖాస్తు చేసుకోండి

2013లో సాహసకృత్యాలు చేసిన యువత టెన్సింగ్‌నార్కె నేషనల్ అడ్వెంచర్ అవార్డ్‌కు దరఖాస్తులను పంపమని భారత ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వశాఖ (న్యూఢిల్లీ) ఆహ్వానిస్తోందని ఈనెల2న జిల్లా యువజన సంక్షేమశాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 7వతేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు www.yas.nic.inలో చూడవచ్చని, లేదంటే నెల్లూరు ఏ.కె.నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో గల జిల్లా యువజన సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించమని కోరారు.


# స్థలములు & ఇల్లు అమ్మబడును

**భవానినగర్, కోవూరులో DTCP హైదరాబాద్ వారి అనుమతి పొందిన లే అవుట్ నందు అన్ని వసతులతో, అన్ని ఫేసులలో ఇండ్ల ప్లాట్లు మరియు ఒక డూప్లెక్స్ హౌస్ నార్త్ ఈస్ట్ కార్నర్ తూర్పు ఫేసింగ్ కలది అమ్మకమునకు కలవు.**

కావలసినవారు సంప్రదించండి :

**94415 23251, 99892 87971.**






## బలహీనవర్గాల నుండి
# బలమైన అభ్యర్థులు

**నెల్లూరు మున్సిపాల్టీ నగర పాలకసంస్థగా మారాక ఈ నెల 30న రెండోసారి ఎన్నికలు జరుగనున్నాయి. నగరపాలక సంస్థకు 2005లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ మేయర్ స్థానాన్ని చేజిక్కించుకుంది. ఆరోజు కాంగ్రెస్, తెలుగుదేశంల మధ్య హెూరాహెూరీ పోరు నడిచినప్పటికి సీపీఎం, ఇండిపెండెంట్లు, కో-ఆప్షన్ సభ్యుల సహకారంతో కాంగ్రెస్ కార్పొరేషన్‌లో తిష్టవేసింది. మొదట పులిమిశైలజ, ఆ తర్వాత నందిమండలం భానుశ్రీలు మేయర్‌లుగా వచ్చారు.**

నగరపాలకసంస్థ మేయర్ పదవి ఈసారి బి.సి జనరల్ అయ్యింది. ఈసారి మూడు ప్రధానపార్టీలు రంగంలో ఉంటున్నాయి. మూడు పార్టీలు కూడా బి.సిల నుండి బలమైన అభ్యర్థులను రంగంలోకి తెస్తున్నాయి. కాంగ్రెస్ నుండి మాజీమేయర్ భానుశ్రీతో పాటు నగర కాంగ్రెస్ అధ్యక్షులు చాట్ల నరసింహ రావుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే భానుశ్రీ పోటీకి విముఖత చూపుతున్నట్లుగా తెలుస్తుంది. సీమాంధ్ర అంతటా కాంగ్రెస్‌కు వ్యతిరేక వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పోటీ చేసినా ఫలితం వుండదనే ఆలోచనలో ఆమె ఉన్నట్లు తెలుస్తుంది. గత 5ఏళ్లలో తాము చేసిన అభివృద్ధి పనులు కూడా మరుగున పడిపోయేలా ప్రజల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత ప్రబలిందని వారు భావిస్తున్నారు.

ఇక వైయస్సార్ కాంగ్రెస్ తరపున మేయర్ అభ్యర్థిగా ముస్లిం వర్గాల నుండి స్టార్ ఆక్వా అధినేత అబ్దుల్ అజీజ్‌ను లేదా అతని తమ్ముడు జలీల్‌ను ప్రకటించనున్నారు. అజీజ్ నగరం అసెంబ్లీ సీటుకే ప్రయత్నించారు. అయితే ఈ సీటును అనిల్‌కు ఇస్తానని జగన్ గతంలోనే హామీ ఇచ్చివున్నాడు. అయితే మైనార్టీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ మేయర్ సీటును జగన్ వారికి వదిలాడు. నెల్లూరు మున్సిపాల్టీలో గాని, నగర పాలక సంస్థగా మారాక గాని ముస్లింలు కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా మాత్రమే పరిమితమయ్యారు. గతంలో సంధాని బాషా ఒక్కడే వైస్‌ఛైర్మన్‌గా పనిచేసారు. చాలాఏళ్ల తర్వాత నెల్లూరులో తమ వర్గానికి రాజకీయంగా ఉన్నతమైన అవకాశం వచ్చిందని, జగన్మోహన్‌రెడ్డితోనే ఇది సాధ్యమైందని ముస్లింలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మరోపక్క తెలుగుదేశం అభ్యర్థిగా ప్రముఖ చిన్నపిల్ల వైద్యులు డాక్టర్ జడ్.శివప్రసాద్‌ను ఖరారు చేసినట్లుగా తెలుస్తుంది. పేదలవైద్యుడిగా శివప్రసాద్‌కు నగరంలో మంచి పేరుంది. గతంలో ఐఎంఏ అధ్యక్షుడిగాను, పార్టీ డాక్టర్స్ సెల్ కన్వీనర్‌గాను నగరంలో ఎన్నో వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి పేదప్రజలకు ఉచితంగా వైద్యసేవలందించారు. రాష్ట్రస్థాయిలో పార్టీ డాక్టర్స్ సెల్ విభాగాన్ని బలోపేతంచేసారు. పార్టీలో అందరి సహకారం వుంది. వివాదరహితుడుగా పేరుంది. ఇక తెలుగుదేశం నాయకులకు కూడా ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకం కానున్నాయి. మరో నెల తర్వాత జరిగే లోక్‌సభ, శాసనసభ ఎన్నికలలో పరిస్థితేంటనేది ఈ మున్సిపల్ ఎన్నికల్లోనే వెల్లడవుతుంది. కాబట్టి ఈ మున్సిపల్ ఎన్నికల్లోనే తమ సత్తా చాటుకోవాలని తెలుగుదేశం నాయకులు ఉత్సాహపడుతున్నారు.

నెల్లూరు నగరపాలక సంస్థలోని 54 డివిజన్‌లలో ఈసారి త్రిముఖపోటీ ఉండబోతుంది. మెజార్టీ మార్క్ 27డివిజన్‌లు సాధించిన పార్టీయే నగరపాలక సంస్థపై జెండా ఎగురవేయగలుగుతుంది. ఈ మూడింటిలో ఆ సత్తా ఏ పార్టీకుందో చూడాలి.

# "బాబు గర్జన"

(మొదటిపేజీ తరువాయి)

ఘనస్వాగతం పలికారు. నేరుగా లియో హోటల్‌కెళ్లి కొద్ది సేపు అక్కడ గడిపిన చంద్రబాబు తర్వాత కేవిఆర్ పెట్రోల్‌బంకు సెంటర్‌కు చేరుకున్నారు. సాయంత్రం 6గంటలకు అక్కడ నుండి ర్యాలీ మొదలైంది. చంద్రబాబు ఓపెన్‌టాప్ జీపెక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. భారీసంఖ్యలో కార్యకర్తలు పార్టీ జెండాలు చేతపట్టి ర్యాలీలో హుషారుగా పాల్గొన్నారు. దారి పొడవునా అభిమానులు పూలతో బాబుకు స్వాగతం పలికారు. సభ జరిగిన వీఆర్‌సి మైదానం చుట్టూ చంద్రబాబు ఫోటోలతో పెద్దఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేసారు. సభలో నిండుగా కనిపించిన జనాన్ని చూసేసరికి చంద్రబాబుకు హుషారొచ్చింది. ఎంతో ఉత్సాహంగా ఆయన ప్రసంగం సాగింది. రొటీన్‌కు భిన్నంగా చంద్రబాబు తన ప్రసంగం మొదలుపెట్టారు. మహాకవి తిక్కన, కవయిత్రి మొల్ల, అమరజీవి పొట్టి శ్రీరాములు, స్వాతంత్ర్య సమరయోధులు బెజవాడ గోపాలరెడ్డి, సినీకవి ఆత్రేయ, సినీనేపథ్యగాయకులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంలు నెల్లూరు వారని, పెన్నా నీళ్లు తాగిన గొప్ప వ్యక్తులని చెపుతూ నెల్లూరీయులను ఆకట్టుకునే ప్రయత్నం చేసారు. పుచ్చలపల్లి సుందరయ్య, పుచ్చలపల్లి రామచంద్రారెడ్డిల గురించి ఆయన ప్రత్యేకంగా చెప్పడం గమనార్హం. కాంగ్రెస్, వైకాపాలను ఓడించి సింహపురి పౌరుషాన్ని చాటాలంటూ ఆయన రెచ్చగొట్టారు. సోనియా తయారుచేసిన అనకొండలుగా జగన్మోహన్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డిలను అభివర్ణించారు. సామాజిక తెలంగాణ, స్వర్ణసీమాంధ్రలను తయారు చేయడమే తన కర్తవ్యంగా ఆయన చెప్పుకున్నారు. జాబు కావాలంటే బాబు రావాల్సిందే అని యువత ఎదురుచూస్తుందని, వారి కోసమైనా తాను అధికారంలోకి వస్తానన్నారు. తాను ముఖ్యమంత్రి అయితే జిల్లా అభివృద్ధికి ఏమేం చేస్తారో చెప్పుకొచ్చారు. కృష్ణపట్నం, దుగరాజపట్నం పోర్టులను అభివృద్ధి చేయడం, విమానాశ్రయం, ఇఫ్కో ఎరువుల ఫ్యాక్టరీ వంటివన్నీ తెస్తానన్నారు. చెన్నై టు నెల్లూరు పారిశ్రామిక కారిడార్‌ను తీసుకొస్తానన్నారు. జిల్లాకు మరెన్నో హామీలు ఆయన ఇచ్చారు. తన ప్రసంగంలో ఆయన గతంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా చేసిన టి.అనూరాధ పనితీరును మెచ్చుకోవడం విశేషం.

సభలో తెలుగుదేశం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వర్ల రామయ్య, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అరుణ, కురుగొండ్ల రామకృష్ణ, బల్లి దుర్గాప్రసాద్, పరసారత్నం, బీద మస్తాన్‌రావు, టి.రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డిలు ప్రసంగించారు. సభకు జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు బీద రవిచంద్ర అధ్యక్షత వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజే నెల్లూరులో ప్రజాగర్జన నిర్వహించడం, అది సక్సెస్ కావడంతో తెలుగుదేశం నాయకులు తెగ సంతోషపడిపోయారు. తెలుగుదేశం పార్టీపై వస్తున్న నెగిటివ్ ప్రచారంతో తర్జనభర్జనలో వున్న క్యాడరంతా బాబుగర్జనతో నూతనోత్తేజాన్ని పొందారు.

# సమరానికి సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిసా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీకు కూడా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది.

ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ రాష్ట్రాన్ని విభజించిన తర్వాత ఇవి తొలి ఎన్నికలు. 7వ దశలో ఏప్రిల్ 30న తెలంగాణలో 17లోక్‌సభ స్థానాలకు, 119 అసెంబ్లీ స్థానాలకు, 8వ దశలో మే7వ తేదీన సీమాంధ్రలో 25లోక్‌సభ స్థానాలకు, 175అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలలో 'నోటా' ఓటును కూడా అమలు చేయనున్నారు. దేశ వ్యాప్తంగా మొత్తం 81.4కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కు ద్వారా కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోబోతున్నారు. ఈ ఎన్నికలకు 10కోట్ల మంది కొత్త ఓటర్లు వచ్చినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

ఎన్నికల నోటిఫికేషన్‌తో దేశవ్యాప్తంగా ఎన్నికల సంగ్రామానికి తెరలేచినట్లే. వాస్తవానికి చూస్తే గత రెండు నెలలుగా దేశంలో ఎన్నికల వాతావరణమే నెలకొంది. కేంద్రంలో అధికారాన్ని నిలుపుకునే దిశగా యూపిఏ, అధికారాన్ని సాధించుకునే దిశగా ఎన్డీఏ తమతమ ప్రయత్నాలలో మునిగిపోయాయి. ఈ ఎన్నికలు నరేంద్ర మోడీ వర్సెస్ రాహుల్ గాంధీ అన్నట్లుగా మారాయి. అయితే వామపక్షాలు, మరికొన్ని ప్రాంతీయపార్టీలు కలిసి కట్టిన మూడోకూటమితో ఏ కూటమికి కూడా సంపూర్ణ మెజార్టీ వచ్చే పరిస్థితి కనపడలేదు. గత పదేళ్లలో ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ వైఫల్యాలు ఈ ఎన్నికలలో తీవ్ర ప్రభావం చూపబోతున్నాయి. యూపిఏకు చేదు ఫలితాలు తప్పవని అంచనా! రాహుల్‌గాంధీ ఎంత గింజుకుని ప్రచారం చేసినా కాంగ్రెస్‌ను గట్టెక్కించే పరిస్థితి లేదు. మరోపక్క బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్రమోడీ మాత్రం శ్రీహరికోట షార్‌సెంటర్ నుండి ప్రయోగించిన రాకెట్‌లా దూసుకుపోతున్నాడు. ఒకేరోజులో రెండుమూడు రాష్ట్రాలలో బహిరంగ సభలు నిర్వహిస్తూ సొంత ఇమేజ్‌ను అమాంతం పెంచేసుకుంటున్నాడు. దేశవ్యాప్తంగా కూడా ఎన్డీఏకు సానుకూల వాతావరణం ఏర్పడింది. ఇక మూడోకూటమి చూస్తే కేవలం ప్రధాని పదవే వీరిలక్ష్యంగా వుంది. ఈ కూటమిలో ఉన్న జయలలిత, ములాయంసింగ్ యాదవ్, నితీష్‌కుమార్‌లు ప్రధాని పదవి రేస్‌లో ఉన్నారు. వామపక్షాలు వీరినే నమ్ముకుని ఉన్నాయి. ప్రధాని పదవి రాదని తెలిస్తే వీళ్లు మళ్లీ ఎవరిదారిన వాళ్లు పోతారు. మొత్తానికి ఈసారి ఎన్నికలు భలే రంజుగా ఉండబోతున్నాయి. పదేళ్ల యూపిఏ పాలనకు ప్రజలు ఎన్ని మార్కులేస్తారో తెలుస్తుంది. గుజరాత్‌లాగా దేశాన్ని అభివృద్ధి చేస్తానంటున్న మోడీని ఎంతవరకు ఆదరిస్తారో తేలుతుంది.

# ముళ్ళకిరీటం

(మొదటిపేజీ తరువాయి)

నెల్లూరులో ప్రసిద్ధిచెందిన మూడు నక్షత్రాల హోటల్ డి.ఆర్ ఉత్తమ అధినేతగా అందరికీ సుపరిచితుడైన కొడవలూరు ధనుంజయరెడ్డి జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులుగా నియమితులయ్యారు. పూర్తి స్థాయిలో ఆయన రాజకీయాలపై దృష్టి పెట్టకపోయినప్పటికీ జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ పరంగా జరిగే ప్రతి కార్యక్రమంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాల్గొనేవాడు. జిల్లా కాంగ్రెస్‌లో అన్నివర్గాల నాయకులతోనూ ఆయనకు సత్సంబంధాలున్నాయి. వివాదాస్పదుడు కాదు, ఎవరికీ విరోధి కాదు, అందరితో మంచిగా మెలిగే గుణముంది. కోటకు చెందిన ఈయన తొలుత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనుచరుడిగా ఉండేవాడు. ప్రస్తుతం ఆనం సోదరులతో సఖ్యతగా ఉంటున్నాడు. ఆనం రామనారాయణరెడ్డి సిఫార్సుతోనే డిఆర్‌ను డీసీసీ అధ్యక్ష పదవి వరించింది. ఆర్టీసీలో కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘమైన ఎన్ఎంయుకు ప్రస్తుతం రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఆ యూనియన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయడంలో డిఆర్ కృషి ఎంతైనా వుంది. ఇంతకాలం ఆయన కాంగ్రెస్‌పార్టీ కోసం పనిచేసాడు తప్పితే, పార్టీలో పదవుల కోసం పాకులాడలేదు. పాకులాడితే పదవులు రావని, అర్హత ఉంటే వాటంతటవే వస్తాయనేదానికి డి.ఆర్ ఉదంతంఒక నిదర్శనం. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో వున్న విషయం మనకు తెలిసిందే. మరీ ముఖ్యంగా రాష్ట్ర విభజన అనంతరం సీమాంధ్రలో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతే అనుకుంటున్న తరుణంలో డి.ఆర్.కి ఈ పదవి... పాపం ముళ్ళకిరీటమే!

# 'నరసింహా'వతారం

(మొదటిపేజీ తరువాయి)

విరమించినట్లుగా సీన్ క్రియేట్ అయ్యింది. అంత తతంగం అవరం లేకుండానే గవర్నర్ పని ముగించాడు. ఇక సీఎం పదవికి రాజీనామా చేసేముందు కిరణ్ హడావిడిగా తీసుకున్న నిర్ణయాలపై కూడా ఆయన పునఃసమీక్ష మొదలుపెట్టారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్న అందరిచేత రాజీనామాలు చేయిస్తున్నారు. కిరణ్ సంతకాలు చేసిన కీలకఫైళ్లను తెప్పించుకుని చూస్తున్నారు. కిరణ్ చివరి నిముషంలో చేసిన బదిలీలను తిరగ తోడుతున్నారు. జిల్లాలవారీగా అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. వైకాపా అధినేత జగన్ తిరుమల దర్శనంపై ఆరోపణలు వచ్చిందే తడవు నివేదిక పంపించమని టీటీడీని ఆదేశించారు. గవర్నర్ నరసింహన్ చాలా చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఇంకో రెండు మూడు నెలలు పోతే ప్రజలు కిరణ్, రోశయ్యల పాలనకంటే గవర్నర్ పాలనే బాగుందనుకున్నా ఆశ్చర్యపోనక్కరలేదు.

# రోటరీక్లబ్ ఉచితశిక్షణ

నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వున్న ఏనుగు సుందరరామిరెడ్డి రోటరీ కల్యాణ మండపంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా జ్ఞాపకశక్తి, వేగవంతంగా గణితసమస్యలు సాధించడం, యోగాలపై శిక్షణ ఇస్తున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు టి.శేఖర్, కార్యదర్శి ప్రతాప్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, పురప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోమని వారు కోరారు. వివరాలకు 9441854387లో సంప్రదించగలరు.




తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత జన్మదినాన్ని పురస్కరించుకుని ఇటీవల చెన్నైలో తమిళనాడు తెలుగు యువశక్తి నిర్వహించిన 'యంగ్ ఇండియా అవార్డ్' పురస్కార సభలో క్రీడాకారిణి ఆశ్రితారెడ్డి, జర్నలిస్టులు సంధ్యారవిశంకర్, శిరీషారెడ్డి, వసుంధర, ప్రమీల, సినీహీరోయిన్ సదా, టీవీ నటి మనీషాయాదవ్, దివ్యదర్శినిలను సత్కరిస్తున్న సంస్థ అధ్యక్షులు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి

# 13, 14, 15 తేదీలలో కవిత్రయ జయంత్యుత్సవాలు

నెల్లూరులోని రేబాలలక్ష్మీ నరసారెడ్డి పురమందిరంలో ఈ నెల 13, 14, 15 తేదీలలో కవిత్రయ జయంత్యుత్సవములు జరుగనున్నట్టు తిక్కవరపు రామరెడ్డి కవిత్రయ జయంతి సంఘము బాధ్యులు తెలిపారు.

13 సాయంత్రం జరుగనున్న సభలో "నన్నయ కవితాతత్త్వం"పై తిరుపతిలోని తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కె.జె.కృష్ణమూర్తి ఉపన్యసిస్తారని, కవిత్రయ జయంతి సంఘాధ్యక్షులు పి.వి.రమణారెడ్డి అధ్యక్షత వహిస్తారని, ముఖ్యఅతిథిగా మోడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. 14 సాయంత్రం జరిగే సభలో "ఎఱ్ఱన కవితా వైదుష్యము" పై తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర సాహిత్య ప్రాజెక్టు రీసెర్చ్ ఆఫీసర్ ఆచార్య కె.వి. రాఘవాచార్య ఉపన్యసిస్తారని, కవిత్రయ జయంతి సంఘ కోశాధికారి జె.వి.రెడ్డి అధ్యక్షత వహిస్తారని, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. 15 సాయంత్రం సభలో తిక్కన కవితా వైభవముపై మదనపల్లి రచయితల సంఘం కార్యదర్శి కరణం బాల సుబ్రహ్మణ్యపిళ్ళై ఉపన్యసిస్తారని, మధుర కవి అగస్త్యరెడ్డి వెంకురెడ్డి అధ్యక్షులుగా, పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. సభకు పూర్వం ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల విద్యార్థినుల భక్తి గీతాలాపన వుంటుందని తెలిపారు. సాహిత్యాభిమానులు అందరూ ఈ కవిత్రయ జయంత్యుత్సవములో పాల్గొని జయప్రదం చేయమని కోరారు.




ఇటీవల విజయవాడ ఐఎమ్ఏ హాలులో జరిగిన సాహిత్య కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన కవి కె.వి.నాగేశ్వరరావును "ఎక్స్‌రే" ఉత్తమ ప్రధాన కవిత అవార్డు, జ్ఞాపిక, రూ॥10,000/- నగదుతో సత్కరిస్తున్న చలువాది మల్లికార్జునరావు, ప్రముఖ సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ, గాయని ఇంద్రగంటి జానకీబాల, అంబటి మధుమోహనకృష్ణ, దేవినేని కిషోర్‌కుమార్, గోళ్ళ నారాయణరావు

# తెలుగుజాతిని సర్వనాశనం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ



కాంగ్రెస్, భాజపాలు తెలుగుజాతిని సర్వనాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నాయని వైకాపా సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి విమర్శించారు. గూడూరు పట్టణంలోని రోడ్డు భవనాల అతిథిగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీమాంధ్రపై కక్ష పెట్టుకుని రాష్ట్రాన్ని కాంగ్రెస్ విభజించిందని అందుకు భారతీయ జనతాపార్టీ సహకరించడం దారుణమన్నారు. సీమాంధ్రకు న్యాయం చేస్తామన్న భాజపా విభజనకు కారణమైందన్నారు. కాంగ్రెస్‌పార్టీ టీడీపీలో విలీనమయ్యేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. సీమాంధ్రకు ప్యాకేజీలు ఇస్తామని ప్రధానమంత్రి చెప్పడంతోనే తమ ప్రాంతం నుంచి పరిశ్రమలన్నీ తరలిపోతాయని, తమకు కూడా ప్యాకేజీలు ఇవ్వాలని తెలంగాణ నాయకులు అనడం దారుణమన్నారు. తిరుపతిలో ఓ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వేసిన శిలాఫలకంలో కేంద్రమంత్రి జైరామ్‌రమేష్‌తో పాటు ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు పేరు కూడా వేయడాన్నిబట్టే వారు ఎలా కుమ్మక్కయ్యారో తెలుస్తోందన్నారు. రాష్ట్రాన్ని ముక్కలు చేస్తుంటే ప్రేక్షకపాత్ర వహించిన చింతా మోహన్ తిరుపతిని రాజధానిని చేద్దామని ప్రకటనలివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమైక్యాంధ్ర కోసం ఉద్యమించిన ఒక్క వైఎస్సార్‌సీపీకి ఓట్లేసి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

### శ్రీ కోదండ రామాంజనేయ స్వామి, ధర్మరాజు స్వామి ఆలయాల

# నూతన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న కోదండ రామాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు

గూడూరు పట్టణం కోనేటిమిట్టలోని శ్రీ కోదండ రామాంజనేయస్వామి, గడియారం స్థంభం వద్ద వున్న ధర్మరాజుస్వామి ఆల యాల నూతన కమీటీల సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ కోదండ రామాంజనేయస్వామి ఆలయ ఛైర్మన్‌గా డేగా సురేష్, ధర్మరాజస్వామి ఆలయ ఛైర్మన్‌గా వీరుబోయిన గోపాల్‌యాదవ్ ఎన్నికైనట్లు తెలిపారు. వారిచేత ఆదివారం నాడు ఈఓ తాతా శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. వారితో పాటు శ్రీ కోదండ రామాంజనేయస్వామి దేవాలయ డైరెక్టర్లుగా జమల్ల సుకన్య, రమణబాబు, మురళీ, విజయలక్ష్మీ, నారాయణాచార్యులు ప్రమాణస్వీకారం చేశారు. ధర్మరాజులస్వామి ఆలయ డైరెక్టర్లుగా ఉడుతా శరత్‌యాదవ్, గిద్దలూరు రమ, కొండూరు మోహన్‌రాజు, పట్నం రామముని ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఏఎంసీ ఛైర్మెన్ బాబురెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మనుబోలు ప్రసాదరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, డీసీసీబి డైరెక్టర్ ముత్యాలయ్య, కాంగ్రెస్‌నాయకులు కె.మునిగిరీష్, వాసుయాదవ్, ముక్కస శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

# ఏడో అదనపు కోర్టు ప్రారంభం



జిల్లా కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ బి.చంద్రకుమార్

గూడూరు కోర్టులో ఏడో అదనపు జిల్లా కోర్టును ఈనెల 1వతేదీ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ బి. చంద్రకుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రారంభించిన అనంతరం మొదటి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులకు న్యాయం, రాజ్యాంగం, హక్కులు, బాధ్యతలు, చట్టాలు అన్నీ తెలుసుగనుక వారే సమాజ నాయకులు అని అన్నారు. కోర్టులు ప్రజలకు మరింత చేరువగా ఉండాలని, కొత్త కోర్టులు దేశమంతటా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. న్యాయం చేయడం ప్రభుత్వం విధి అని తెలిపారు. ఈ న్యాయం ప్రజలకు ఉచితంగా అందాలన్నారు. వైద్య, విద్య, న్యాయం ఏకాలంలో అయినా ప్రజలకు అందించాల్సిందేనని అన్నారు. ఇప్పటికి 20ఏళ్ల కేసులు కూడా నడుస్తున్నాయని, కేసులకు సంబంధించిన వారి కుమారులు కూడా వస్తున్నారంటే అర్థమవుతుందన్నారు. పేదవారు స్త్రీలు, కార్మికులు, ఎస్సీ, ఎస్టీలు, వికలాంగుల కోసం ఉచితంగా లీగల్ సర్వీసులు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. న్యాయమూర్తి జ్ఞానేనేత్రాలతో ఆలోచించాలని ఏది సత్యం, ఏది అసత్యం అన్నది తెలుసుకోవాలని, కాగితాలే ప్రయాణం కాదని మేధస్సుతో తీర్పు చెప్పాలని కోరారు.

ప్రిన్సిపల్ జిల్లా జడ్జి సి. హెచ్.కనకదుర్గారావు మాట్లాడుతూ గూడూరులో జిల్లా కోర్టు ప్రారంభం అందరి చిరకాల కోరిక అని అన్నారు. అనంతరం సీనియర్ న్యాయవాదులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జీలు గురప్ప, రాజారాం, మురళీధర్, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయికుమార్‌రెడ్డి, జిల్లాలోని జడ్జీలు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం

### డీఎస్పీ చౌడేశ్వరి

పురపాలక, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు నిఘా పెరిగిందని, తనిఖీలు ముమ్మరం చేసినట్లు డీఎస్పీ కె.చౌడేశ్వరి అన్నారు. అవసరమైతే అత్యవసర వాహనాన్ని కూడా వదలమన్నారు. గూడూరులోని తన కార్యాలయంలో సోమవారం డివిజన్‌లోని సిఐలతో ఎన్నికల సందర్భంగా సమావేశం నిర్వహించారు. గూడూరు డివిజన్ సరిహద్దుల వద్ద పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ముఖ్యంగా మనుబోలు, పెళ్లకూరు, వరదయ్యపాళెం, వీరంపల్లి, తీగచర్ల, తడ తదితర ప్రాంతాల్లో చెక్‌పోస్టులుంటాయన్నారు. సిబ్బంది 24గంటలు విధుల్లో ఉంటూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తారన్నారు. ఎక్కువ మొత్తం నగదు తీసుకొని పోతున్నా, సరైన లెక్కలు చూపకున్నా కేసులు పెడతామన్నారు. డివిజన్‌లోని రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు డిఎస్పీ చౌడేశ్వరీ తెలిపారు.

# ఎంపీడీవో బాధ్యతలు స్వీకరణ

గూడూరు ఎంపీడీవోగా సీవీ శ్రీనివాసప్రసాద్ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదలీలో భాగంగా చిత్తూరు జిల్లా కార్వేటి నగరం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన గూడూరులో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న నిర్మలాదేవి కడపజిల్లా వి.మఠం ఎంపీడీవోగా బదలీపై వెళ్లారు.

### ఎన్నికల కోడ్ అమలుతో

# ప్రచార హోర్డింగ్స్ తీసివేయాలి



గూడూరు పట్టణంలో ఎన్నికల కోడ్ అమలులో వున్నందున అన్ని ప్రాంతాల్లో తక్షణం రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, ప్రచార హోర్డింగ్‌లను స్వచ్ఛందంగా తొలగించేలా సహకరించాలని ఆర్డీవో మధుసూదనరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ అమలులో వున్నందున పురపాలక పరిధిలోని అన్ని ప్రాంతాల్లోని రాజకీయ నాయకులు సహకరించాలని, ప్రభుత్వ అధికారులు కూడా కార్యాలయాల్లో ఎలాంటి ప్రచార పత్రాలను ప్రదర్శించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఏ రాజకీయ పార్టీలకు అధికారులు సహకరించినట్లుగా తెలిస్తే కఠినచర్యలు ఉంటాయని అన్నారు. ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలపై ప్రత్యేక నిఘా వుంటుందన్నారు.

# క్రికెట్ పోటీల విజేత సింహపురి లెవన్స్



ట్రోఫీ అందుకుంటున్న సుధీర్ లెవన్స్ జట్టు

గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో పదిరోజులుగా జరుగుతున్న కనుమూరు సత్యనారాయణరెడ్డి మెమోరియల్ అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు ఆదివారం జరిగిన ఫైనల్‌లో సింహపురి లెవన్స్ జట్టు విజేతగా నిలిచింది. తిరుపతికి చెందిన సుధీర్ లెవన్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు కె.హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ క్రికెట్ పోటీలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో స్నేహభావం పెరుగుతుందన్నారు. అల్లూరు ఆదిశేషారెడ్డి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ట్రస్టీ ఛైర్మెన్ జానకిరామిరెడ్డి మాట్లాడుతూ స్టేడియంలో నిరంతరం వివిధ క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు అనంతరం బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో కె.రవిచంద్రారెడ్డి, కె.మునిగిరీష్, టి.ఆర్.మణి తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల గూడూరులో సీనియర్ న్యాయవాది, న్యాయశాస్త్ర రచయిత వై.రామారావును సన్మానిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి వి.చంద్రకుమార్, ప్రక్కన ఏజేపీ వై.చలపతిరావు.



# 'దేశం'లోకి మాగుంట

**మారుతున్న రాజకీయ చిత్రం**

ఒంగోలు మాజీపార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఇప్పటికే కాంగ్రెస్‌పార్టీని వీడారు. రాష్ట్ర విభజనతో కాంగ్రెస్‌పై మన స్థాపం చెందిన ఆయనకు ఇక ఆ పార్టీలో ఉండడానికి మన సొప్పక రాజీనామా చేయడం జరిగింది. ఇప్పుడు తెలుగుదేశంలో చేరడానికి ఆయన సిద్ధమవుతున్నారు. మరో రెండురోజుల్లో ఈ విషయం తేలిపోవచ్చు. మాగుంట శీనయ్య తెలుగుదేశంలోకి వస్తే జిల్లాలో ఆ పార్టీ సమీకరణలే మారిపోయే సూచనలున్నాయి. శీనయ్యను నెల్లూరు లోక్‌సభ స్థానం నుండి దించే అవకాశాలున్నాయి. ఇప్పటివరకు ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్లమెంటు అభ్యర్థిగా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని నెల్లూరురూరల్ అభ్యర్థిగా అనుకుంటున్నారు. శీనయ్య వస్తే ఆదాల, సోమిరెడ్డిల స్థానాలు మారే పరిస్థితి వుంది. లోక్‌సభ కాకపోతే ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ నియోజకవర్గాన్ని కోరుకుంటాడు. అప్పుడు సోమిరెడ్డి సర్వేపల్లికే పోవాల్సివస్తుంది. దీనికి సోమిరెడ్డి ఎంతవరకు ఒప్పుకుంటాడనేది సందేహం. త్వరలోనే శీనయ్య నిర్ణయం వెలువడవచ్చు.

## ఇఫ్కో రెప్రజెంటేటివ్ జనరల్ బాడీ సభ్యుడిగా

# తలమంచి సురేష్‌కుమార్‌రెడ్డి



ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో ఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో) కార్యాలయంలో 13వ రెప్రజెంటేటివ్ జనరల్ బాడీ ఎన్నికలు మార్చి 3వ తేదీ సోమవారం జరిగాయి. ఈ ఎన్నికలలో 5 జిల్లాల నుండి 7 మందిని ఆర్.జి.బి సభ్యులుగా ఎన్నుకోగా వీళ్ళలో 5మంది గతంలోనే ఏక్రగీవంగా ఎన్నికకాబడ్డారు. మిగిలిన ఇద్దరు సభ్యులకు సంబంధించి 3వ తేదీ జరిగిన మలిదశ ఎన్నికలలో టి.సురేష్‌కుమార్‌రెడ్డి, పి.జయరామరెడ్డిలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరిలో జయరామరెడ్డిది అనంతపురం కాగా, తలమంచి సురేష్‌రెడ్డి నెల్లూరీయుడు. ది సింహపురి మ్యూట్యువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కి కూడా సురేష్‌రెడ్డి అధ్యక్షులుగా ఉన్నారు.

న్యూఢిల్లీ కేంద్ర కార్యాలయంగా పని చేసే ఇఫ్కోలో 2014 నుండి 5 సంవత్సరాల పాటు సురేష్‌రెడ్డి జనరల్ బాడీ సభ్యుడిగా ఉంటాడు.

## అన్నమయ్య సర్కిల్‌లో...

# ఆదివారం కూడా ఆంధ్రాబ్యాంక్ సేవలు



ఆదివారం బ్యాంక్ సేవలను ప్రారంభిస్తున్న తుంగా శివప్రభాత్‌రెడ్డి, పక్కన బ్యాంక్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి

ఆంధ్రాబ్యాంక్ తమ ఖాతాదారులకు మరో వరాన్ని ప్రకటించింది. నెల్లూరు నగరంలో అన్నమయ్య సర్కిల్‌లో ఇటీవలే ప్రారంభించబడిన తమ శాఖలో మార్చి 2వతేదీ ఆదివారం నుండి ఆదివారం సేవలను ప్రారంభించింది.

ఉదయం10గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకూ ఈ బ్యాంకు వినియోగదారులకు సేవలు అందిస్తుందని ఆ శాఖ మేనేజర్ బి.సుధాకర్‌రెడ్డి చెప్పారు. ముఖ్యంగా బంగారు నగలపై రుణం తీసుకునే వారికి ఈ ఆదివారం బ్యాంక్ బాగా ఉపయోగపడుతుందని చెప్పారు.

మార్చి2వతేదీ ఆదివారం ఉదయం మాగుంట లే అవుట్స్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, అన్నమయ్య జయంత్యుత్సవ కమిటీ ముఖ్య సమన్వయకర్త తుంగా శివప్రభాత్‌రెడ్డి ఆదివారం సేవలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. లే అవుట్ అసోసియేషన్ కార్యదర్శి కనుమూరు శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి ముడి శోభన్‌రెడ్డి, సహకార్యదర్శులు దండి హేమంత్‌కుమార్, వట్టిగుంట చంద్రయ్య చౌదరిలతో పాటు, వ్యాపారవేత్త యట్టం హనుమారెడ్డి, వై.యస్.సేవాసమితి సభ్యుడు కందికట్టు విజయకుమార్ బ్యాంకు మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది రాము, నరసింగరావు నరేంద్ర, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు 'దేశం'లోకి కోడూరు దంపతులు

గూడూరు మున్సిపాల్టీ మాజీచైర్‌పర్సన్ శ్రీమతి కోడూరు కల్పలత, మీరారెడ్డి దంపతులు తెలుగుదేశంపార్టీలో చేరనున్నట్లు తెలుస్తుంది. గత కొంతకాలంగా వారు రాజకీయాలకు దూరంగా వుంటున్నారు. 2000లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గూడూరు మున్సిపాల్టీ నుండి కోడూరు కల్పలత స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి భారీమెజార్టీతో విజయం సాధించారు. ఏ పార్టీ గుర్తు లేకుండా ఆమె అప్పుడు సొంతంగా గెలవడం సంచలనమైంది. కాలక్రమంలో ఆ దంపతులు కాంగ్రెస్‌పార్టీలో చేరి, ఆనం వర్గానికి ముఖ్యఅనుచరులుగా కొనసాగారు. మారిన పరిస్థితుల్లో వాళ్ళు తెలుగుదేశంపార్టీని ఎంచుకున్నారు. గూడూరు మున్సిపాల్టీ ఛైర్మెన్ పదవి జనరల్‌గా మారడంతో కల్పలత, మీరారెడ్డి దంపతులు ఈ సీటును ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. వీరితో పాటు కోడూరు శ్రీనివాసులురెడ్డి, శీలం కిరణ్‌కుమార్‌లు ఛైర్మెన్ రేస్‌లో వున్నారు.

# ట్రైనీ జాయింట్ కలెక్టర్‌గా ఇంతియాజ్ అహ్మద్

నెల్లూరుజిల్లాకు ట్రైనీ జాయింట్‌కలెక్టర్‌గా ఇంతియాజ్ అహ్మద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో ఈనెల5న ఆయన నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లో రిపోర్టు చేసారు. విజయవాడలో వాణిజ్యపన్నులశాఖ ఉపకమీషనర్‌గా పనిచేస్తున్న ఆయన ట్రైనీ జాయింట్ కలెక్టర్‌గా నెల్లూరులో నియమితులయ్యారు. గతంలో ఆయన ఇక్కడే డిసిగా పనిచేశారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.